

ఉష్ణోగ్రత (అంచనా)

14-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	29
తెనాలి	40	28
నరసరావుపేట	39	27
బాపట్ల	39	29
రెంటచింతల	39	27
చీరాల	39	29

మృత్యువేగం



రెండు కుటుంబాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

- శివాపురం వద్ద బొలేరో ట్రక్కు.. లారీ ఢీ
- బొప్పాయి కోత పనికి వస్తుండగా దుర్ఘటన
- మొత్తం నలుగురు మృతి ముగ్గురికి తీవ్రగాయాలు
- బాధితులందరూ యర్రగొండపాలెం మండల వాసులే




మృతిచెందిన రమణారెడ్డి, సుబ్బమ్మ రామాంజి , అంకమ్మ దంపతులు



వినుకొండటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): సొంత గ్రామంలో పనులు లేవు.. 40 కిలోమీటర్ల దూరంలోని ఓ బొప్పాయి తోటలో కోత పనులు దొరికాయి. వారం నుంచి రోజూ ప్రయాణించి పనులు చేసుకుని తిరిగి ఇళ్లకు వెళ్తున్నారు. అయితే మంగళవారం వారు ఇళ్ల నుంచి పని ప్రాంతానికి బయల్దేరేరే కానీ ఇళ్లకు చేరలేదు. వేగం ఆయా కుటుంబాల్లో విషాదం నింపింది. రెండు కుటుంబాల్లో భార్యా భర్తలు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని శివాపురం గ్రామసమీపంలో మంగళవారం ఉదయం జరిగిన ఈ దుర్ఘటనలో బాధితులందరూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం సమీపంలోని గడ్డమీదపల్లెకు చెందిన వారే. ఇందుకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు.. వెల్లలచెరువు సమీపంలోని



వైద్యశాల వద్ద విలపిస్తున్న రమణారెడ్డి కుటుంబసభ్యులు

అడ్డ రోడ్డుకు బొప్పాయి కాయలను కోసేందుకు గడ్డమీదపల్లెకు చెందిన పగడాల రమణారెడ్డి(45), ఆయన భార్య సుబ్బమ్మ (40), జొన్నగిరి రామాంజి(36), ఆయన భార్య అంకమ్మ(28)తో పాటు కన్నెబోయిన నాగమణి, పగడాల శివమ్మ, కదిరి నాగేశ్వరరావు(డ్రైవర్) బొలేరో ట్రక్కులో వస్తున్నారు. అదే సమయంలో కొబ్బరికాయల లోడుతో వినుకొండ నుంచి మార్కాపురం వెళ్తున్న లారీ, కూలీలు ప్రయాణిస్తున్న బొలేరో ట్రక్కు వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీ రోడ్డుపై బోల్తా పడగా.. ట్రక్కులోని కూలీల్లో సుబ్బమ్మ, అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. రమణారెడ్డి, రామాంజి వినుకొండలోని వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందారు. నాగమణి, శివమ్మ, నాగేశ్వరరావులు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

నిరుపేద కుటుంబాలకు చెందిన వారే..

వేసవిలో స్వగ్రామంలో పనులు దొరకక పోవడంతో మృతుల కుటుంబాలు బొప్పాయి కాయలు కోసేందుకు వారం నుంచి వెల్లలచెరువు సమీపంలో ఓ బొప్పాయి తోటలో పనులకు వస్తున్నారు. బొలేరో ట్రక్కు నిండా కాయలు కోస్తే రూ.3700 వస్తాయి. దీంతో డ్రైవర్‌తో పాటు మిగిలిన ఆరుగురు కూలీలు ఆ మొత్తాన్ని పంచుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా రోజులానే బయల్దేరగా మార్గమధ్యలో అనుకోని సంఘటనతో వారి కుటుంబాల్లో విషాదం అలుముకుంది. రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తె అరుణకు వివాహం చేయగా కుమారుడు వెంకటరెడ్డి, మరో కుమార్తె నవిత ఉన్నత చదువులు చదువుతున్నారు. జొన్నగిరి రామాంజి, అంకమ్మ దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో పిల్లల పరిస్థితి ఏమిటని బంధువులు కన్నీటి పర్యంతమవుతు న్నారు. ఒకే ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన దంపతులు మృతితో గడ్డమీదపల్లె నుంచి పెద్దసంఖ్యలో వారి బంధువులు, గ్రామస్థులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని సంఘటనపై విచారం వ్యక్తం చేశారు.

బాధితులకు అండగా ఉంటాం : ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

పనుల కోసం వస్తూ నలుగురు మృతి చెందడంపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సంతాపం తెలిపారు. ఘటన విషయం తెలిసిన వెంటనే ఆస్పత్రికి వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయాన్ని అందజేస్తామన్నారు. మంత్రి లోకేశ్ సూచన మేరకు మృతదేహాలను స్వగ్రామాలకు తరలించడంతో పాటు చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఆర్డీవో మధులత, డీఎస్పీ నాగేశ్వరరావు బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు.

మరమ్మతులకు.. మోక్షం



తెనాలి : ఇరువైపులా కట్టలు, గోడలు దెబ్బతినిపోయి గండ్లుపడేలా ఉన్న డెల్టా కాల్వ

ఖరీఫ్ సమీపిస్తోంది. సాగునీటి కాల్వలు చూస్తే అధ్వానం. వేసవి ముగిసేనాటికి కాల్వల మరమ్మతులు చేపట్టాలి. గత నెలలో జిల్లాల వారీగా మరమ్మతులకు సంబంధించి అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. రోజులు గడు స్తున్నా నిధులపై ప్రభుత్వంలో స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో మరమ్మతులు ఇక ఉండవని.. ఈ ఏడు కూడా కడ 'గండ్లు' తప్పవేమోనని ఆందోళనలో ఉన్న రైతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ తీపికబురు చెప్పింది. డెల్టా, నాగార్జునసాగర్ పరిధిలోని కాల్వల మరమ్మతులు సత్వరం చేపట్టాలని.. అవసరమైతే స్వల్పకాల టెండర్లు నిర్వహించి నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఇక సాగునీటి కాల్వలకు మహర్దశ
- డెల్టాకు రూ.50 కోట్లు, సాగర్‌కు రూ.37 కోట్లు
- ఐదేళ్ల తర్వాత అడిగినన్ని నిధులు మంజూరు
- నెలాఖరులోపు పూర్తి చెయ్యాలని మంత్రి నిమ్మల ఆదేశం
- అవసరమైతే స్వల్పకాల టెండర్లు పిలవాలని అధికారులకు సూచన

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి మరమ్మతులకు నిధులు విడుదల చేయ డంతో కృష్ణా డెల్టా, సాగర్ పరిధిలో కాల్వలకు మహర్దశ పట్టనుంది. 'కాల్వల నిర్వహణకు కాసులు కావాలి' అనే శీర్షికన ఈ నెల 6న ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం స్పందించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమా వేశంలో కాల్వలకు నిధులు మంజూరుపై నిర్ణయం తీసుకుంది. దీంతో అడిగినన్ని నిధులు మంజూరు చేసింది. ఈ నెలాఖరులోపు కాల్వల మరమ్మతులన్నీ పూర్తిచెయ్యాలని, అవసరమైతే స్వల్పకాల టెండర్లు పిలవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ అధికారులను కూడా ఆదేశించారు. దీంతో సాగునీటి సంఘాలు కాల్వల మరమ్మతుల కోసం రంగంలోకి దిగాయి. అత్యవసర మరమ్మతుల ప్రాతిపదికన పనులను సాగునీటి సంఘాలు పూర్తిచేస్తాయనే నమ్మకాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా డెల్టా కింద గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. పల్నాడు జిల్లా పరిధిలోని సాగర్ కాల్వలకిందా భారీగానే సాగుభూములు ఉన్నాయి. వీటి పరిధిలోని కాల్వల మరమ్మతుల కోసం నీటిపారుదల శాఖ అధికారులు గత నెలలో ఓఅండ్ఎం నిధుల కింద రూ.25 కోట్లు చొప్పున రెండు డెల్టాల పరిధిలో రూ.50 కోట్ల అవసరమని ప్రతిపాదనలు పంపారు. అటు సాగర్ ఆయకట్టు పరిధిలోనూ రూ.37 కోట్లు, మైనర్ ఇరిగేషన్ అవసరాల కోసం రూ.55 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు నిధులు పూర్తిగా విడుదల కావడంతో పనులు సత్వరం చేపట్టే అవకాశం అధికారులకు లభించింది. అటు డెల్టా, ఇటు సాగర్ పరిధిలో టెండర్లు పిలవాల్సిన పనులు ఎక్కువగా లేనందున సకాలంలో సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో పూర్తిచేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. తొలుత అత్యవసర పనులు పూర్తిచేస్తామని అధికారులు ప్రకటించారు. ఖరీఫ్‌కు పనులు పూర్తి చేసి చివరి భూములకు సైతం సాగునీటిని అందించగలమన్న ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో కడ'గండ్లు'

వైసీపీ హయాంలో సాగునీటి కాల్వల బాగుకు నిధులు విడుదల (మిగతా 6వ పేజీలో)

నీటి తీరువాతో సంబంధం లేకుండా..

గత ప్రభుత్వంలో సాగునీటి కాల్వల బాగు గురించి పట్టించుకోలేదు. దీంతో ఈ ఏడాది రైతులు నీటితీరువా సక్రమంగా చెల్లించలేదు. వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులు కాల్వల నిర్వహణకు కేటాయిస్తారు. అయితే ఈ సంవత్సరం కేవలం 10 నుంచి 25 శాతం వరకే అంటే రూ.32 కోట్లు మాత్రమే వసూలైంది. దీంతో నీటి తీరువా పూర్తిగా వసూలయ్యే వరకు ఆగాలని అధికారులు భావించారు. అప్పటి వరకు అంటే సీజన్ గడువు దాటిపోతుంది. ఈ పరిస్థితుల్లో నీటితీరువాతో సంబంధం లేకుండా కాల్వల అత్యవసర మరమ్మతులకు నిధులను మంజూరు చేయాలని ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. ఈ పరిస్థితుల్లో నీటి తీరువాతో సంబంధం లేకుండా మొత్తం నిధులు మంజూరు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు రూ.50 కోట్లు, సాగర్ కాల్వలకు రూ.37 కోట్లు మంజూరైనట్లు నీటి పారుదల శాఖ గుంటూరు జిల్లా నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటరత్నం తెలిపారు.

జంపని డ్రెయిన్‌లో తూటికాడ





కాల్వల నిర్వహణకు నిధులు కావాలంటూ ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ఓడి.. గెలుస్తారా

- చీరాల మున్సిపల్ చైర్మన్‌పై నేడే అవిశ్వాసం
- క్యాంపు రాజకీయాలకు తెర.. గజిబిజిగా సమీకరణాలు
- రాజీనామా చేసి రమ్మన్న ఎమ్మెల్యే.. ససేమిరా అన్న చైర్మన్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అనేక మలుపులు తిరిగిన చీరాల మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస ఘట్టం క్లైమాక్స్‌కు చేరింది. పదవిని కాపాడుకునేందుకు టీడీపీ బాట పట్టిన చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే కొండయ్య ఊహించని షాకిచ్చిన సంగతి తెలిసిందే. పార్టీలోకి వచ్చినా అవిశ్వాసంపై ఓటింగ్ జరుగుతుందని ఎమ్మెల్యే తేల్చాశారు. దీంతో కంగుతిన్న జంజనం తెరవెనుక ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. గత ఎన్నికలో టీడీపీ తరఫున గెలిచింది ఒక్కరే. చీరాలలో ఎన్నికల అనంతరం 18 మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు. వీరిలో అధిక శాతం మంది చైర్మన్ జంజనం ఒంటెద్దు పోకడలు నచ్చక పార్టీ మారిన వారే. వీరి అవిశ్వాస ప్రయత్నాలకు చెక్‌పెట్టే ఉద్దేశంతోనే జంజనం సైకిలెక్కారు. ప్రస్తుత సమీకరణాలు చూస్తుంటే అవిశ్వాసం నెగ్గి ఆయన మాజీ కావడం ఖాయంగా కనిపిస్తోంది. కౌన్సిలర్లతో ఇప్పటికే రిసార్టు రాజకీయాలకు తెరలేపిన నేతలు తెరవెనక ప్రయత్నాలు కూడా ముమ్మరం చేశారు. దీంతో అవిశ్వాసం ఏ దారి తీసుకుంటుందో అనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. 19 మంది కౌన్సిలర్లు గత నెలలో కలెక్టర్ వెంకటమురళిని కలిసి అవిశ్వాసానికి నోటీసులివ్వడంతో ఓటింగ్‌కి కలెక్టర్ ఆదేశాలిచ్చారు. చైర్మనే టీడీపీ కండువాతో ప్రత్యక్షమయ్యారు. ఈ క్రమంలో అవిశ్వాసం జరుగుతుందా లేదా అనే చర్చ జరుగుతుండగానే ముందుగా నిర్ణయించిన ప్రకారమే ఓటింగ్ ఘట్టం జరిగి తీరుతుందని ఎమ్మెల్యే తేల్చేశారు. దీంతో రాజకీయం రసకందాయకంలో పడింది. చైర్మన్ పదవిని నిలుపుకోవడానికి జంజనం టీడీపీ బాట పట్టినా ఇప్పుడు అదే పార్టీ అవిశ్వాసాన్ని నెగ్గించడానికి ప్రయత్నిస్తోంది. దీంతో ప్రస్తుతం టీడీపీలో ఉన్న చైర్మన్ ఓడిపోతేనే టీడీపీ గెలిచినట్లవుతుంది. ఈ క్రమంలో జంజనం కోసం వైసీపీ పెద్దలే తిరిగి రంగప్రవేశం చేసి బేరసారాలకు తెరతీసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం జంజనం హడావిడిగా ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ నేతల ప్రయత్నాలు ఫలించి ఇద్దరు కౌన్సిలర్లు మెత్తబడి చైర్మన్ జంజనంకు అనుకూలంగా మారినట్లు సమాచారం. దీంతో అవిశ్వాసం ఎపిసోడే గజిబిజిగా మారింది. చైర్మన్ జంజనం ప్రస్తుతం టీడీపీలో ఉంటే ఆయన్ను గట్టెక్కించడానికి వైసీపీ పెద్దలు రంగంలోకి దిగడం ఓ విచిత్రమయితే, ఆదరాబాదరాగా చైర్మన్‌కు పార్టీ కండువా కప్పి ఇప్పుడు ఆయన్ను గద్దె దించడానికి టీడీపీ సర్వశక్తులు ఒడ్డడాన్ని పట్టణ ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రకటనపై రాని స్పష్టత

చైర్మన్ పదవికి రాజీనామా చేసే పార్టీలోకి రావాలని జంజనం శ్రీనివాసరావును ఎమ్మెల్యే కొండయ్య కోరినట్లు తెలుస్తోంది. దానిపై స్పష్టత ఇవ్వకుండానే ఆయన సైకిలెక్కారు. తర్వాత కూడా చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని పలుమార్లు జంజనాన్ని ఎమ్మెల్యే కోరడం, ఆయన ససేమిరా అనడం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలోనే తనను కలిసిన కౌన్సిలర్లకు ఎమ్మెల్యే కొండయ్య అవిశ్వాసంపై భరోసా ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవిశ్వాసంపై ఓటింగ్ జరిగి తీరుతుందని ఆ ఫలితం ఎలా ఉంటే దానికి కట్టుబడి ఉండాల్సిందేనని చైర్మన్‌కు కూడా వారం కిందటే తేల్చి చెప్పారు. బుధవారం నాటి అవిశ్వాసం నెగ్గి చైర్మన్ జంజనం పదవీచ్యుతుడు కావడం ఖాయంగానే కనిపిస్తోంది. తర్వాత జరిగే పరిణామాలలో చీరాల మున్సిపాలిటీపై టీడీపీ జెండా ఎగురవేసే విధంగా సర్వం సిద్ధం చేసినట్లు సమాచారం



ఎమ్మెల్యే కొండయ్యతో సమావేశమైన టీడీపీకి మద్దతిచ్చిన కౌన్సిలర్లు (పాత చిత్రం)

చైర్మన్ రేసులో ముగ్గురు

ప్రస్తుతం ఉన్న చైర్మన్ జంజనం బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. అవిశ్వాసం నెగ్గి చైర్మన్ పీఠం ఖాళీ అయితే బీసీ వర్గానికి చెందిన వ్యక్తికే దానిని కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించి ముగ్గురు పేర్లు ఎమ్మెల్యే పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అవిశ్వాసాన్ని నెగ్గించే విషయంలో ఆర్థికంగా బలంగా ఉన్న ఓ కౌన్సిలర్ తెరవెనక బేరసారాలకు సహాయసహకారాలు అందిస్తున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే చీరాల మున్సిపల్ చైర్మన్ గిరి ఆయననే వరించే అవకాశాలున్నాయి.

శింగరకొండలో.. మహా పూజలు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మహాకుంభాభిషేకం ఈ నెల 19న జరగనున్న నేపథ్యంలో బుధవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. శృంగేరి శారదపీఠం ఉత్తరాధికారి విదుశేఖరభారతీస్వామి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం, జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తిమ్మానాయుడు చెప్పారు. ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ రోజున అద్దంకి నుంచి శింగరకొండ దేవాలయం వరకు జరిగే శోభాయాత్రలో 1500 మంది మహిళలు కలశాలతో గుండ్లకమ్మ నది నుంచి జలం తీసుకుని పాల్గొంటారన్నారు. కర్నాటక నుంచి వచ్చిన ఏనుగు శోభాయాత్ర ముందు నడుస్తుందని చెప్పారు. ఇప్పటికే 5 నదులు, 3 సముద్రాల నుంచి జలం సేకరించి తీసుకొచ్చినట్లు తెలిపారు. మహాకుంభాభిషేకానికి సుమారు 50 వేల మందికి పైగా భక్తులు హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, మజ్జిగ, మంచినీటి బాటిళ్ల అందజేయనున్నారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ రాతి మండపం



ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి

- అభివృద్ధి, సంక్షేమ లక్ష్యంతో విధులు నిర్వహించాలి
- 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ దినకర్‌బాబు

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్‌బాబు తెలిపారు. కేంద్ర పథకాల అమలు, పురోగతి, 20 సూత్రాల కార్యక్రమాల అమలు తీరుపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ లక్ష్యంతో అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించాలని చెప్పారు. వికసిత్‌భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి మోదీ, స్వర్ణాంధ్ర సాధన దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం పనిచేస్తున్నారని, వారి ఆలోచనలకు తగినట్లుగా అధికారులు కలిసి పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా జీడీపీ 11.2 శాతం ఉండగా ఏడాదిలో 15 శాతానికి చేరేలా కృషి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు విస్తీర్ణం పెరిగితే రసాయనాల వినియోగం తగ్గుతుందన్నారు. సూర్యలంక, రామాపురం, మోటుపల్లి బీచ్‌లు అభివృద్ధి చెందితే స్వర్ణాంధ్రలో జిల్లాను భాగస్వామ్యం చేయవచ్చన్నారు. తుంపర సేద్యంలో 3 వేల ఎకరాలు లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. గత ఏడాది 65 లక్షల పనిదినాలతో రూ.195 కోట్లు వినియోగించాలని లక్ష్యం కాగా 182 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధి లక్ష్యాలు చేరుకోకపోవడం వల్ల నిధులను కోల్పోయామని అసంతృప్తి వ్యక్తం చేశారు. జలవనరులు అందుబాటులో లేకుండా గృహాలకు ట్యాప్ కనెక్షన్లు ఇస్తే ఏమి ప్రయోజనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, యువతకు ఉపాధికల్పన, తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, సీపీవో కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్‌బాబు, కలెక్టర్

గుంటూరులో ల్యాండ్ రికార్డ్స్
డిజిటలైజేషన్ వర్క్ షాప్

● గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులు
● పాల్గొననున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ వర్క్‌షాప్ ఈసారి గుంటూరు కేంద్రంగా జరగబోతుంది. గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఈ వర్క్‌షాప్ రెండు రోజులు పాటు నిర్వహించనున్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఆధునిక సాంకేతికతతో కూడిన భూ రికార్డులను అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ ఆధునికీకరణ' కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రెండు రోజుల వర్క్‌షాప్‌ను ప్రజల ముందుకు తీసుకువస్తోంది. అయితే ఈ కార్యక్రమాన్ని ఆ శాఖ కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు పార్లమెంటు సభ్యుడు తన నియోజకవర్గంలో నిర్వహించేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో గుంటూరులోని ఐటీసీ వెల్కమ్ హోటల్లో ఈ వర్క్‌షాప్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి పెమ్మసానితో పాటు రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన సెక్రటరీ శ్రీమతి జయలక్ష్మి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ మనోజ్ జోషి, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఇతర అదనపు సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

బీటెక్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

పెదకాకాని, మే 13(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాదరావు విడుదల చేశారు. 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పునఃమూల్యాంకనం కోసం మే 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. పరీక్షల ఫలితాలు, సమగ్ర సమాచారం ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మరమ్మతులకు.. మోక్షం

(5వ పేజీ తరువాయి)

చేయలేదు. రైతుల చెల్లించిన నీటి తీరువా ఆధారంగా విడుదల చేసే ఓఅండ్‌ఎం నిధులనూ ఇవ్వలేదు. ఓఅండ్‌ఎం నిధులు ఏటా రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు అవసరమని ప్రతిపాదనలు పంపితే రూ.7 నుంచి రూ.11 కోట్లు మాత్రమే మంజూరు చేసేది. ఆ నిధులను ఖరీఫ్ సీజన్ మొదలయ్యే తరుణంలో విడుదల చేయడం.. గడువులోపు పూర్తిచేయలేకపోయారంటూ వెనక్కు తీసుకోవడం పరిపాటిగా మారింది. అరకొర పనులతో మమ అనిపించి నిధులను దోచేసిన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో గడచిన ఐదేళ్ల సాగునీటి కష్టాలతో రైతులు అల్లాడిపోయారు. నీరు లేనప్పుడు నీటి కష్టాలు వెంటాడితే, వర్షాలు ఎక్కువగా పడిన సమయంలో నీరు ఎక్కువై కాల్వలకు గండ్లుపడి, పంటలను తుడిచిపెట్టేసిన పరిస్థితులున్నాయి. సజావుగా పంట పండుతుందన్న నమ్మకంలేక పొలాలను ఖాళీగా వదిలేసిన సందర్భాలున్నాయి.

అమరావతి రాజమార్గాల పనులకు పీఎంసీల కోసం టెండర్లు

విజయవాడ, మే 13(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రధాన రాజమార్గాల పనులను వేగవంతంగా చేపట్టేందుకు వీలుగా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ) కోసం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) మంగళవారం టెండర్లు పిలిచింది. అమరావతి ప్రధాన రాజమార్గాలైన ఈ-13, ఈ-15ను రూ.750 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ఇటీవల టెండర్లు పిలిచింది. టెండర్లు కూడా ఖరారు కావస్తున్నాయి. ఈ క్రమంలో పనులను ముందుకు తీసుకు వెళ్లటానికి వీలుగా పీఎంసీలను నియమించాలని నిర్ణయించటం జరిగింది. వీరి పర్యవేక్షణలో కాంట్రాక్టు సంస్థ పనులు చేపట్టాల్సి ఉంటుంది.




తానికొండ దయాబాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ

దయాబాబు మృతి టీడీపీకి తీరనిలోటు

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్.. ● అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు వేగేశన, ఆనందబాబు

బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత, అంకితభావంతో పార్టీ కోసం పనిచేసిన తానికొండ దయాబాబు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు అని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలోనే తుదిశ్వాస విడిచిన దయాబాబు మృతదేహానికి మంగళవారం ఎంపీతో పాటు.. బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ సందర్శించి, పుష్పాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన అంతిమ యాత్రలో కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మృతదేహంపై తెలుగుదేశంపార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రకార్యదర్శి గంటా అంజిబాబు, మాజీ కౌన్సిలర్ పేర్లి సునీల్‌కుమార్, బక్కా రోశయ్య, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు నివాళులర్పించారు.

మాజీ ఎమ్మెల్యే రోశయ్య మా స్థలాన్ని ఆక్రమించారు

● స్థలం దగ్గరకు వస్తే చంపుతామని బెదిరిస్తున్నారు ● కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన మహిళ



జరుగుతున్న అక్రమ నిర్మాణాలు

గుంటూరు కార్పొరేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): తమ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆక్రమించారని, అందులో అనధికారకంగా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని బాధితురాలు గుమ్మడి భారతి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. గుంటూరు నగరంలోని చుట్టుగుంటలో ఉన్న కేకేఆర్ సినిమా హాల్ వెనుక భాగంలో భారతి స్థలం ఉంది. దానికి ముందు, వెనుక భాగంలో పొన్నూరు మాజీ ఎమ్మెల్యే రోశయ్యకు స్థలం ఉంది. ఈ క్రమంలో భారతిని స్థలం విక్రయించాలని గతంలో అనేక పర్యాయాలు రోశయ్య అడిగారు. అందుకు ఆమె అంగీకరించలేదు. ఈ క్రమంలో తమ స్థలాన్ని కూడా కలుపుకొని అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారంటూ బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అదేమని ప్రశ్నిస్తే రోశయ్య అనుచరులు శ్రీకాంత్, రామబ్రహ్మం తమను బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ విషయమై రోశయ్యను కలిసి విన్నవిస్తే.. ఆ స్థలం తమదేనని, మీకు దిక్కున్న కాడ చెప్పుకోండి అని అన్నారని, నిర్మాణాలకు అడ్డొస్తే చంపేస్తానంటూ బెదిరిస్తున్నారని బాధితురాలు భారతి కమిషనర్, జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు సమష్టిగా కృషి చేయాలి

● రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు

గుంటూరు సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.రామారావు పేర్కొన్నారు. మంగళవారం గుంటూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సీఈవో రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 11.60 లక్షల మంది రైతులు 13 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం విధానాలు అనుసరిస్తున్నారని తెలిపారు. నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్‌గా గుర్తించబడ్డ రైతు సాధికార సంస్థ ప్రపంచ స్థాయిలోనూ గుర్తింపు పొందిందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతుల సంక్షేమంతో పాటు ప్రజలు, నేల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్, 365 రోజుల పచ్చదనం, నేల ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుందని చెప్పారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు ప్రకృతి వ్యవసాయం దిశలో వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. మూడు రోజుల శిక్షణలో నేర్చుకొన్న అంశాలను గ్రామ స్థాయి వరకు చిత్తశుద్ధితో తీసుకువెళ్లాలని కోరారు.



మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు

రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డీవీ రాయుడు, వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శిక్షకులకు పలు సూచనలు చేశారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ వీడియో ప్రసంగాన్ని ప్రదర్శించారు. సంస్థ లీడ్‌లు గోపీచంద్, చంద్రశేఖర్, చక్రవర్తి, సీనియర్ కన్సల్టెంట్‌లు రామచంద్రం, రవిచంద్ర, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో 59,877 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ

సంయుక్త వ్యవసాయ సంచాలకులు కృపాదాస్

నరసరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికి 59,877 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు హోల్ సేల్, రిటైల్ దుకాణాలతో పాటు వివిధ కంపెనీల గోదాముల్లో ఉన్నాయని సంయుక్త వ్యవసాయ సంచాలకులు వీడీవీ కృపాదాస్ తెలిపారు. ఎరువుల నియంత్రణ చట్టం 1985, ఎరువుల వినియోగం పై స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో అయన మాట్లాడారు. ఖరీఫ్‌లో అవసరం మేరకు.. కొరత లేకుండా జిల్లాకు ఎరువులను సరఫరా చేయడం జరుగు తోందన్నారు. చట్టానికి లోబడి నిజాయితీతో రైతులకు నష్టం లేకుండా.. వ్యాపారం చేయాలని ఎరువుల వ్యాపారులకు సూచించారు. తగు రశీదు ఇవ్వడమే కాక ఆధార్ సంఖ్యతో ఈ పాస్ నందు అమ్మకాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 590 మందికి ఈ పాస్ పరికరాలు సరఫరా చేయడం జరిగిందన్నారు. పరికరాల నిర్వహణకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. జిల్లాలో మూడేళ్లలో అధిక మొత్తంలో యూరియా విక్రయించిన 1,393 మంది డీలర్లను విచారించి 334 మందికి రూ. 11,45,000 అపరాధ రుసుం విధించినట్లు వెల్లడించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ గతేడాది 3,05,261 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేశామని చెప్పారు. పల్నాడు జిల్లా ఎరువుల వాడకంలో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందని వెల్లడించారు. సగటున హెక్టారుకు 445 కేజీలు వివిధ పోషకాలను ఎరువుల రూపంలో వాడుతున్నారని తెలిపారు. వ్యవసాయ సంచాలకులు రాజన్, ప్రేమ్ కుమార్, రవికుమార్, వ్యవసాయ అధికారి పి.ప్రవీణ్ పాల్గొన్నారు.



సంయుక్త వ్యవసాయ సంచాలకులు కృపాదాస్

గుర్తుతెలియని బాలుడి మృతి



నరసరావుపేట లీగల్, మే 13, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో కాలనీ మొదటి వీధిలో ఉన్న ప్రత్యేక దత్తత సంస్థలో ఈ నెల 12న రాత్రి మూడేళ్ల గుర్తుతెలియని బాలుడు మృతి చెందినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. ఈ నెల 11న మధ్యాహ్నం నరసరావుపేట రూరల్ పోలీసులు మూడేళ్ల అనాథ బాలుడిని తీసుకొచ్చి చేర్పించారని సంస్థ మేనేజర్ మాతంగీ కుమారి ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు బాబు శారీరకంగా మానసికంగా, బలహీనంగా ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక దత్తత సంస్థ సిబ్బంది బాబుకు రాత్రి పాలు ఇచ్చారని, అర్ధరాత్రి ఉలుకు పలుకు లేకుండా బాబు పడి ఉన్నాడని సంస్థ సిబ్బంది మేనేజర్ కుమారికి తెలియపరిచారు. ఆమె బాలుడిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని పేర్కొన్నారు. బాలుడి వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో, 94906 17742, 0864 7225333 నంబర్లకు సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారంకి 512.90 అడుగులు ఉంది. ఇది 136.64 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 450, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రైతులకు ప్లాట్ల కేటాయింపు బాధ్యత కమిషనర్‌దే..

విజయవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు, సీఆర్‌డీఏ పరిధిలో భూ సమీకరణ విధానాన్ని అవలంబించాల్సి వస్తే.. భూ యజమానులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు బాధ్యతలను ఇక మీదట సీఆర్‌డీఏ కమిషనర్ కానీ, అథారిటీ కానీ కేటాయింపులు జరిపే అధికారాన్ని కల్పిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో రిటర్నబుల్ ప్లాట్లను లాటరీ పద్ధతిలో నిర్వహించేవారు.

భర్తను ముంచేసి ఉడాయించిన భార్య

రూ.80 లక్షలకుపైగా మోసం చేసిందంటూ ఫిర్యాదు

అనంతపురం, మే 13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడైన భర్తను మోసగించి, లక్షలాది రూపాయలతో ఉడాయించింది ఓ భార్య. దీనిపై బాధితుడు, అనంతపురం జిల్లా బెళుగుప్ప ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఇబ్రహీం ఫయాజ్ బాషా మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫయాజ్ బాషా పోలియో కారణంగా దివ్యాంగుడయ్యారు. ఆయనకు గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ షబీనాతో మూడేళ్ల క్రితం వివాహమైంది. జల్సాలకు డబ్బులివ్వాలని ఆమె భర్తను బెదిరించేది. ఫయాజ్ బాషా పేరున బ్యాంకులో రూ.30 లక్షలు రుణం తీసుకుని, తన అక్క జరీనాకు ఇచ్చింది. ఇంటి స్థలాన్ని రూ.41 లక్షలకు దౌర్జన్యంగా అమ్ముకుంది. ఐదు తులాల బంగారం, రూ.6 లక్షల కారుతో గత నెల 29న పరారైంది. తన భార్యతోపాటు ఆమె అక్క, తల్లిదండ్రులు తనను మోసగించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివ తెలిపారు.

సబ్ ట్రెజరీలోని విగ్రహాల పరిశీలన



బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో 2013లో డిపాజిట్ చేసిన విగ్రహాలను అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. 2003లో పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామ రైతు అన్వర్ ఆలీ అన్నారి పొలం మరమ్మతులు చేస్తుండగా అందులో విలువైన విగ్రహాలు, సామగ్రి బయటపడింది. అధికారులు వాటిని సేకరించి భద్రపరిచారు. అనంతరం బాపట్ల సబ్‌ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేశారు. 2014లో సదరు రైతు తన పొలంలో లభించిన విగ్రహాల విలువలో కొంత తనకు ఇచ్చి ఆదుకోవాలని కోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు ఆదేశాల మేరకు తాజాగా పురావస్తుశాఖాధికారుల బృందంతోపాటు పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, చందోలు వీఆర్వో అరుణ ప్రసన్న, ఆర్ఐ శ్రీనివాసరావు, చందు తదితరులు కలిసి డిపాజిట్ చేసిన విగ్రహాలను, సామగ్రిని పరిశీలించి, తిరిగి డిపాజిట్ చేసి వెళ్లారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఆరుగురికి గాయాలు

వినుకొండటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురితో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని కొత్తపాలెం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాల వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ మేరేట్ నుంచి వలస వచ్చి నీలగంగవరంలో మసీదులో పనిచేస్తున్న ముజమ్మీర్, బాహర భార్యభర్తలతో పాటు అత్త షమీమ్, ఇద్దరు చిన్నారులు ద్విచక్ర వాహనంపై వినుకొండ వస్తున్నారు. వీరిని కొత్తపాలెం గ్రామానికి చెందిన పల్లెపోగు పీటర్ ద్విచక్ర వాహనంపై వస్తూ ఎదురెదురుగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అందరూ గాయపడ్డారు. హైవే అంబులెన్స్ ద్వారా పీటర్‌ను వైద్యశాలకు తరలించగా.. ముజమ్మీర్ కుటుంబ సభ్యులు ఆటోలో ఓ ప్రైవేటు వైద్యశాలకెళ్లి.. చికిత్స పొందుతున్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



ఆదినారాయణ (పాతచిత్రం)

ముప్పాళ్ళ మే13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చాగంటివారిపాలెంలో జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆళ్ల ఆదినారాయణ(45) ఏటా ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పసుపు పంటలను సాగుచేస్తుంటారు. సాగు ఖర్చులకు రూ.10 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ ఏడాది కూడా ఆశించిన మేర దిగుబడి రాకపోవడం, పంటలకు మద్దతు ధర లేకపోవడంతో.. అప్పులు తీర్చే మార్గం లేదని సోమవారం ఇంటి వద్దే గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ ఆదినారాయణ మంగళవారం మృతిచెందాడు. మృతునికి భార్య రమా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గాజుల్లంక ఇసుక క్వారీలో ఆకస్మిక తనిఖీలు

● యంత్రాలు సీజ్ చేయాలని అధికారులను ఆదేశించిన ఆర్డీవో



క్వారీలో తనిఖీలు చేస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు

కొల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): గాజుల్లంక ఇసుక క్వారీలో ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఇష్టానుసారంగా ఇసుక తవ్వుతున్నారని, రాత్రిపగలు తేడా లేకుండా యంత్రాలను వినియోగిస్తూ ఇసుక తోడేస్తున్నారని రైతులు అధికారులకు వివరించారు. గుర్తించిన ప్రాంతంలో కాకుండా.. మరొక ప్రదేశంలో తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఏడీ రాజేష్ కుమార్‌ను వివరణ కోరగా జియో కో-ఆర్డినేట్స్ ప్రకారం హద్దులు కాంట్రాక్టర్ చూపించడం జరిగిందని, ఇసుక తవ్వకాలు అక్కడే చేస్తున్నట్లుగా తెలిపారు. మీటరు లోతున తవ్వకాలు చేయాలని వారికి ముందే చెప్పామని ఏడీ వివరించారు. ఇప్పటికీ నదిలో భారీ యంత్రాలతోనే తవ్వకాలు సాగుతున్నాయని, మీ కళ్ల ఎదుటే నది నుంచి ఇసుక లోడ్‌తో లారీలు రావడం మీరు గమనించలేదా అంటూ అధికారులను స్థానికులు ప్రశ్నించారు. స్పందించిన ఆర్డీవో యంత్రాలు సీజ్ చేయాలని ఏడీని ఆదేశించారు. పైగా ప్రభుత్వ ఉచిత ఇసుక క్వారీని నిలుపుదల చేసి, వర్షా కాలంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక నిల్వ చేయిస్తున్నామని అధికారులు స్థానికులకు వివరించి, అక్కడ నుంచి నిష్క్రమించారు. తనిఖీలలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, సీఐ బీవీ ఆంజనేయులు, ఏఎస్ఐ అర్జున్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రుణం తీర్చలేక.. రైలు కింద పడి..!

వినుకొండటౌన్, మే 13, (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బాంక్ సిబ్బంది వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మార్కాపురం రోడ్డులోని గౌరైల మండీ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన తొగటి బుల్లి రోశయ్య (40) కొంతకాలం క్రితం ప్రైవేట్ బాంక్‌లో ఇంటిని తనకాపెట్టి రుణం తీసుకున్నాడు. క్రమం తప్పకుండా కొంత కాలంగా లోన్ చెల్లిస్తూ వచ్చాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులకు గురై, చేసిన అప్పులు తీర్చలేక బాంక్ రుణం చెల్లించలేక పోయాడు. ఈ క్రమంలో ప్రైవేట్ బ్యాంక్ సిబ్బంది వేధింపులు తాళలేక మూడు రోజులు క్రితం రోశయ్య ఇంటి నుండి వెళ్లిపోయినట్లు సమాచారం. చివరకు సాయంత్రం 5 సమయంలో ఇంటికి ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసినట్లు తెలిసింది. చిరవకు రైలు కింద పడి మృతి చెందినట్లు ఆప్రాంత వాసులు తెలిపారు. రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు తమకు రైల్వే కీమేన్ ఇచ్చిన వివరాలు మాత్రమే ఉన్నాయని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

17 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

చిలకలూరిపేట, మే13 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 17, 18, 19 తేదీల్లో సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో చిలకలూరిపేటలోని తూర్పు మాలపల్లిలోని చంద్రమౌళి పార్క్ క్రీడా మైదానంలో మూడు రోజులు పాటు ఫ్లడ్ లైట్ల వెలుగులో నైట్ మ్యాచ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు తమ జట్లను ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సాతులూరి హనుమంతరావు 98497 94238, ఆంజనేయ రాజు 95730 67224, సాతులూరి ప్రకాష్ 99633 73996, సాతులూరి బెంజమిన్ 86887 45866, శివ గణేష్ 63054 07457 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

మోటుపల్లి ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తెస్తాం

- కలెక్టర్ జె.వెంకటమురళి
- అభయ శాసనాలను తెలుగులోకి అనువదిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : మోటుపల్లి ప్రాచీన ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తెస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మోటుపల్లి గ్రామం, మ్యూజియం నిర్మాణం, వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కాకతీయుల నాటి అభయశాసనాలను తెలుగులోకి అనువదిస్తామని చెప్పారు. ఇప్పటికే పురావస్తు శాఖ పరిశోధకులు, శాసనాల పరిశోధకుల ద్వారా ఆ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. మూడు శాసనాలలో తాత్పర్యం ప్రజలందరికి అర్థమయ్యేలా సాధారణ తెలుగు భాషలోకి అనువదిస్తూ రాళ్ళపై చెక్కిస్తున్నామన్నారు. ప్రాచీన వైభవం తెచ్చేలా ఆలయం అభివృద్ధి చేస్తామన్నారు. కోదండ రామదేవాలయానికి సమీపంలోని 5.8 ఎకరాల భూమిని ఆలయానికి కేటాయిస్తూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయటమైందన్నారు. కాకతీయులు, చోళరాజుల నాటి శాసనాలు, పంచలోహాలను చినగంజాంలోనే భద్రపర్చటానికి మ్యూజియం నిర్మించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. మ్యూజియం నిర్మాణంపై పురావస్తుశాఖకు సమగ్ర నివేదికతతోపాటు లేఖ పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రాచీన సంపద ప్రస్తుతం హైదరాబాద్ మ్యూజియం, చెన్నై మ్యూజియం, విజయవాడ మ్యూజియంలలో ఉందన్నారు. వాటిని తెప్పించటానికి దస్త్రాలను సిద్ధం చేయాలన్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన విలువైన విగ్రహాలు పొరుగురాష్ట్రాలునుంచి మనరాష్ట్రంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాచీనకాలంనాటి బుద్ధుడి విగ్రహాన్ని భద్రపర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధితో మోటుపల్లి మరింత ప్రాచుర్యం పొందనుందన్నారు. సమావేశంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సూర్యప్రకాశరావు, చినగంజాం తహసీల్దార్ ప్రభాకరరావు, మోటుపల్లి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు నిబంధనలు పాటించాలి

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : లేఅవుట్‌ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం బాపట్ల మున్సిపాలిటి, అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ పరిధిలోని అక్రమలేఅవుట్‌లపై సంబంధితాధికారులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. బావుడా పరిధి, మున్సిపాలిటిలో 2019 నుండి 9 మండలాలలో 183 అక్రమలేఅవుట్‌లను గుర్తించి వాటి వివరాలను డిటిసిపికి పంపించటమైనదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అందులో 86 లేఅవుట్‌లను 22ఎ కింద గుర్తించి రిజిస్ట్రేషన్ కింద కాకుండా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్‌కు పంపించటం జరిగిందన్నారు. మిగిలిన 97 లేఅవుట్‌లను సబ్ డివిజన్‌లుగా చేసి పంపగా వాటిని తిప్పి పంపారని వివరించారు 97లేఅవుట్‌లకు సంబంధించి సర్వేనెంబర్లు వారిగా ఆయా తహసీల్దార్‌లతో సబ్‌డివిజన్‌లు చేయించి వాటి వివరాలను బావుడాకు తెలియజేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈవివరాలను డిటిసిపికి పంపి వాటిని రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకోవాలని బావుడా అధికారులను ఆదేశించారు.

183 అక్రమలేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు సంబంధించి సానుకూలంగా, సలహాలతో డిటిసిపికి అనుమతుల కొరకు లేఖ రాయాలని బావుడా అధికారులకు తెలిపారు. కొత్తలేఅవుట్‌ల అనుమతులకు వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. మున్సిపాలిటీలలో, పంచాయతీలలో గృహనిర్మాణాలకు అనుమతలకు సంబంధించి ప్రభుత్వం సూచించిన నియమాలను పీపీటీ ద్వారా బావుడా అధికారి వివరించారు. ఎవరైన గృహాలు నిర్మించుకునేవారు దరఖాస్తులను పంచాయతీరాజ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీపీవో ప్రభాకర్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు, బావుడా ప్లానింగ్ అధికారి షేక్ కాలేషా, లైసెన్స్ టెక్నికల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

సూర్యఘర్‌యోజనపై అవగాహన కల్పించాలి

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం విద్యుత్, డీఆర్‌డీఏ అధికారులు, సోలార్ కంపెనీల డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

సోలార్ కంపెనీలు వారికి కేటాయించిన ప్రాంతాలలో మాత్రమే పనులు చేపట్టాలని చెప్పారు. డిస్కమ్ అధికారులు సోలార్ కంపెనీ ప్రతినిధులను ఇబ్బంది పెట్టవద్దని కలెక్టర్ చెప్పారు. సోలార్ డీలర్‌లను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీనివాసరావు, సోలార్ కంపెనీల డీలర్‌లు పాల్గొన్నారు.


రైతు సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జి.శివన్నారాయణ

అధిక దిగుబడులకు పచ్చిరొట్ట ఎరువులు దోహదం

- డాక్టర్ జి.శివన్నారాయణ

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : అధిక వ్యవసాయోత్పత్తులు సాధించటానికి పచ్చిరొట్ట పంటల సాగు ఎంతగానో దోహదపడుతుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాం విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ జి. శివన్నారాయణ అన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల ఏరువాక కేంద్రం, గ్రామీణ అవగాహన పని అనుభవం కార్యక్రమ విద్యార్థులు సంయుక్తంగా నల్లమోతువారిపాలెం గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. సదస్సుకు డాక్టర్ శివన్నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని వ్యవసాయ ప్రదర్శనను పరిశీలించారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో రైతులు భూసార పరీక్ష చేయించుకొని అవకాశం ఉన్న రైతులు ఖరీఫ్ పంటకు ముందు పచ్చిరొట్ట పంటలు వేసుకోవటం వల్ల దిగుబడిశాతం పెంచుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కదిరి బాబురావు, కాలేజి ఆఫ్ అగ్రికల్చర్ అసోసియేట్ డీన్ డాక్టర్ వీరన్నగౌడ్, బాపట్ల ఏరువాక కేంద్ర జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఆర్.బాలమురళిధర్‌నాయక్, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఉషా, బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త, డాక్టర్ కామాక్షి, ఏడీఏలు ఎ.లక్ష్మీ, ప్రవీణ, వ్యవసాయాధికారి సుమంత్, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కార్డులు అందజేస్తున్నాం

- వ్యవసాయ శాఖాధికారి సుమంత్


సమావేశంలో మాట్లాడుతున్న సుమంత్

కర్లపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : కౌలు దారులకు వ్యవసాయ శాఖ వారి సహకారంతో రెవెన్యూ అధికారుల ద్వారా కౌలు కార్డులు అందిస్తున్నామని వ్యవసాయాధికారి సుమంత్ తెలిపారు. కర్లపాలెం మండలంలోని బుద్ధాం, యాజలి, దుండివారిపాలెం, దమ్మనవారిపాలెం గ్రామాలలో కౌలు కార్డులపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి సుమంత్ మాట్లాడుతూ కౌలుదారులు వ్యవసాయ రుణాలు బ్యాంకుల ద్వారా పొందాలన్నా, అన్నదాత సుఖీభవ ద్వారా ఆర్థికసాయం పొందాలన్నా కౌలుకార్డు తప్పనిసరి అని వివరించారు. కౌలుదారునికి పంట మీద తప్ప భూమి మీద ఎటువంటి హక్కు ఉండదన్నారు. భూ యజమాని నిర్భయంగా కౌలుదారునికి సహకరించవచ్చునని తెలిపారు. కౌలు కార్డు కోసం రైతులు భూమి తాలూకు పాస్ పుస్తకం, కౌలుదారుని ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నెంబరు తీసుకొని గ్రామ వ్యవసాయ సహాయకులను లేదా, వీఆర్వోలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

డీపీటీవో కార్యాలయం ముట్టడి

బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు మంగళవారం డీపీటీవో కార్యాలయం ముట్టడి, ధర్నా నిర్వహించారు. బాపట్ల కొత్తబస్టాండ్ ఆవరణలో అద్దంకి, చీరాల, బాపట్ల, రేపల్లె డిపోల నుంచి నేషనల్ మజ్దూర్ యూనియన్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు పర్చాలని, అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేసి తిరిగి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా అగిపోయిన ప్రమోషన్‌లు వెంటనే ఇవ్వాలన్నారు. పీహెచ్‌ఎస్ స్థానంలో ఆర్టీసీ వారు పాత వైద్య విధానాన్ని అమలు పర్చాలన్నారు. మహిళా ఉద్యోగులకు ఛైల్డ్ కేర్ లీవ్‌లు ఇవ్వాలన్నారు. గ్యారేజి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగులతో మాత్రమే వినియోగించేట్లు చూడాలన్నారు. నైట్ అవుట్ ఆలవెన్స్ రూ.450 సర్క్యులర్‌లో ఉన్నట్లు పెంచాలన్నారు. అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వైఎస్ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు అన్నం రామ్మోహనరావు, కార్యదర్శి తులసీ శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు పెంచలయ్య, గాంధీ, ఆశాబాబు, జిల్లాలోని నాలుగు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.


బాపట్ల బస్టాండ్ ఎదురు ధర్నా చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

విరాళాల లెక్కలు తేలాలి

- బాపట్ల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు విన్నకోట


సమావేశంలో మాట్లాడుతున్న సత్యప్రసాద్

బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి) : శ్రీ క్షీరభావన్నారాయణస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి దాతలిచ్చిన విరాళాల లెక్కలు ప్రైవేట్ కమిటీ సభ్యులు చెప్పటంలేదని ప్రశ్నించటంపై మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఎందుకు స్పందించారో తెలియటంలేదని బాపట్ల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్ అన్నారు. ఈ విషయమై మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లెక్కలు చెప్పాలని తాను విడుదల చేసిన లేఖలో కోన రఘుపతి ప్రస్తావన ఎక్కడా లేదని, కమిటీ సభ్యులు లెక్కలు చెప్పటంలేదని వారిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని మాత్రమే చెప్పినట్లు తెలిపారు. తనతోపాటు తన కుటుంబ సభ్యులు భావదేవుని దేవాలయ పునర్నిర్మాణ పనులకు రూ.85 వేల విరాళం ఇచ్చిన భక్తునిగా ప్రశ్నిస్తున్నట్లు సత్యప్రసాద్ పేర్కొన్నారు. దీనిని రాజకీయాలకు ఆపాదించటం సరికాదన్నారు. దేవదాయశాఖాధికారులు తమకు సంబంధంలేదని చెప్పటం వల్ల లేఖ విడుదల చేసినట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ పనుల సమయంలో వసూళ్ళు చేసిన డబ్బులు స్వామి వారికే చేరాలని, అన్ని లెక్కలు పక్కాగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే కొంతమంది భక్తులు రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ చేపట్టాలని కలెక్టరేట్‌కు ఆదేశాలు వచ్చినట్లు తెలిసిందన్నారు. ఇప్పటికైనా లెక్కలు చెప్పకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

దయాబాబు మృతికి సంతాపం

పిట్టలవానిపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు ఆకస్మిక మృతికి మండలానికి చెందిన టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల ప్రధాన కార్యదర్శి పిట్టు సాయిబాబారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు మోదుగుల శంకరరెడ్డి, కనుమూరి సాంబమూర్తిరాజు, మండల గ్రామ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతికి సంతాపాన్ని తెలిపారు.

● కర్లపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు తానికొండ దయాబాబు ఆకస్మిక మృతికి కర్లపాలెం మండల టీడీపీ నాయకులు విచారం వ్యక్తం చేసి ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో కర్లపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు యేహూరి భూపతిరావు, సీనియర్ నాయకులు మద్దాల మునలయ్య, బాపట్ల నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఆట్ల బాల శంకర్‌రెడ్డి, బేతపూడి గ్రామ పార్టీ సెక్రటరి రావి రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

బేతనీకాలనీలో ఉచిత వైద్యశిబిరం


బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 1వ వార్డు బేతనీకాలనీలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో డాక్టర్ కల్యాణ్, డిపిఎమ్‌వో రత్నమంజలి పాల్గొని వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు ఎం.భాగ్యలక్ష్మి, కమలకుమారి, ఆషావర్కర్లు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి

వైభవంగా వసంతోత్సవం, చక్రస్నానం

బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి) : శ్రీమత్సుసుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. అలాగే చూర్ణోత్సవం, అవభృథం జరిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారు ఉభయదేవరులతో తూర్పుసత్రానికి వేంచేశారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, చక్రస్నానం జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నల్లూరి పాంచజన్యం, మోహనరంగాచార్యులు, శ్రీనివాసుల విఖనసమూర్తి, వినుకొండ సత్యంబాబు, ఆలయ ధర్మకర్త దేశిరాజు వెంకటరమణబాబు, భక్తులు పాల్గొని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వీరాంజనేయస్వామికి కలువ పుష్పార్చన


కలువ పూజ అర్చనలో వీరాంజనేయస్వామి

వేమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీవీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవ కైంకర్యాలలో భాగంగా మంగళవారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృతాభిషేకం జరిపి చందన లేపనం, సిందూర లేపన పూజ జరిపారు. పసుపులేటి సుబ్రహ్మణ్యం దంపతులు కలువ పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం పన్నీరు వేణుగోపాల్ ప్రవాస భారతీయులు తాటి శ్రీకాంత్ దంపతులు స్వామి వారికి అష్టోత్తర సహస్రనామ పూజ జరిపి పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. సీతారామాంజనేయ భజన సమాజం దాస సాహిత్య ప్రాజెక్టు భజన సంఘాల వారు హనుమాన్ చాలీసా పారాయణ, గోవింద నామ సంకీర్తన, భజన కీర్తనలు ఆలపించారు.

మణికంఠకు ఆర్‌ఐగా పదోన్నతి


కేవీ మణికంఠ

బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీ మణికంఠకు ఆర్‌ఐగా పదోన్నతి లభించింది. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందిన మణికంఠను నగరం మండల ఆర్‌ఐగా నియమించారు. కాగా ఆయనను తిరిగి బాపట్లలోనే డిప్యూటేషన్‌పై నియమించనున్నట్లు సమాచారం.

చిత్రకారుడు ముత్తయ్య కన్నుమూత


ముత్తయ్య (ఫైల్)

కర్లపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కర్లపాలెం పంచాయతీ దాస్ నగర్ గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు కొండమూడి ముత్తయ్య మంగళవారం తన స్వగృహంలో కన్నుమూశాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రముఖ చిత్రకారునిగా, అంబేద్కర్‌వాదిగా, అజాతశత్రువుగా కర్లపాలెం మండలంలో పేరుగాంచిన ముత్తయ్య భౌతికకాయానికి దళితనేతలు, పలు ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించిన రెడ్‌క్రాస్ ఛైర్మన్

రేపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందిస్తూ వారి ప్రాణాలు కాపాడేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని రాష్ట్ర రెడ్‌క్రాస్ ఛైర్మన్ యార్లగడ్డ దశరథ రామారావు అన్నారు. ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పనితీరు ఇంకా మెరుగుపరుచుకోవాలని సూచించారు. రాబోయే కాలంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో మ్యాట్రిక్స్ ఫార్మా విరాళంతో కాంపోనెంట్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయటానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. స్థానిక బ్లడ్‌బ్యాంక్‌లో ఇంకా డోనేషన్లు పెంచుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. బ్లడ్‌బ్యాంక్‌కు 10 కేవీ సోలార్ ప్లాంట్‌ను గతంలో ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె రెడ్‌క్రాస్‌ఛైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, కమిటీ సభ్యులు కరిముల్లా, శ్రీనివాస్ పాల్గొన్నారు.


రెడ్‌క్రాస్ ఛైర్మన్ యార్లగడ్డ దశరథరామారావుకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతం పలుకుతున్న డాక్టర్ వసంతం వీరరాఘవయ్య

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

వేమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ముఠా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఈ నెల 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బి.అగస్టీన్ పిలుపునిచ్చారు. వేమూరులోని సివిల్ సప్లయ్ హమాలీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెస్తుందని, అవి అమలైతే కార్మిక చట్టాలు వర్తించవని, పైగా కార్మికులంతా బానిసత్వంలో నెట్టబడతారన్నారు. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు కూడా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సివిల్ సప్లయిస్ ఇన్‌చార్జి అధికారి సుబ్రహ్మణ్యంకు సమ్మె నోటీసు అందజేశారు. సమావేశంలో యార్డు మేస్త్రి వేమూరి విజయరాజు, యోహాను, జి.కిషోర్‌బాబు పాల్గొన్నారు.


సివిల్ సప్లయిస్ ఇన్‌చార్జి అధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, హమాలీలు

హనుమాన్ జయంతి మండల పూజలు

కర్లపాలెం, మే13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యసాయిబాబా మందిరంలో హనుమాన్ జయంతి మండల పూజలు 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మల శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, బొమ్మిశెట్టి శివ సత్యనారాయణ, విజయకాంత్ దంపతులు పూజలలో పాల్గొన్నారు.


మండల పూజలలో పాల్గొన్న భక్తులు


పశువుల దాణా అందిస్తున్న అనగాని శివప్రసాద్ తదితరులు

పాడి రైతుల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

- మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులకు చేయూతనిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడిరైతులకు 50 శాతం సబ్సిడీతో కూడిన పశువుల దాణాను మంగళవారం రైతులకు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే మంత్రి అనగాని సత్యప్రసాద్ తొలివిడత నియోజవర్గంలో 200 గురుకుల షెడ్డులను మంజూరు చేయించి నిర్మించారన్నారు. రెండో దశలో మరో 200 గోకుల షెడ్డులను మంజూరు చేయించారని, పాడి రైతులకు ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీఈ అద్దంకి నాంచారయ్య, టీడీపీ నాయకులు గుర్రం మురహరిరావు, కొలసాని రాము, శ్రీధర్, గోగినేని పట్టాభిరామారావు పాల్గొన్నారు.


రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

భట్టిప్రోలు (కొల్లూరు), మే 13 (ఆంధ్రజ్యోతి) : రైతు శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. భట్టిప్రోలులోని 1, 2 రైతు సేవ కేంద్రాల్లో కౌలుదారు హక్కు పత్రాలపై ఏవో కె.ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయిబాబా మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన పచ్చిరొట్ట పైర్లు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం జనుము, పిల్లి పెసర, జీలుగ విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉంచారన్నారు. 50 శాతం రాయితీపై ప్రభుత్వం రైతులకు ఈ పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తుందని చెప్పారు. ఏవో మాట్లాడుతూ, వ్యవసాయ భూముల్లోని కౌలు రైతులు కౌలుదారు హక్కు పత్రం పొందవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద హక్కుపత్రం పొందిన రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయంగా పొందవచ్చని తెలిపారు. ఈ-పంట నమోదు చేసుకున్న కౌలు రైతులకు ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టపోయినప్పుడు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు లాంటి ప్రయోజనాలు చేకూరతాయన్నారు. రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంబంధిత పత్రాలతో కూడిన దరఖాస్తులను వీఆర్వోలకు అందించి కౌలు రైతు కార్డు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కాశీకృష్ణ, ఏఈవోలు, వీహెచ్‌వోలు పాల్గొన్నారు.


పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా, ఏవో ప్రసన్నలక్ష్మి

సీబీఎస్ఈ ఫలితాలలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


నేహా కొక్కిలిగడ్డ

చెరుకుపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ టెన్త్ ఫలితాలలో పొన్నపల్లి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా నేహ కొక్కిలిగడ్డ 96.4 శాతం, ఏడుగురు విద్యార్థులు 90 శాతం పైగా మార్కులు సాధించారు. ఇందులో నలుగురు బాలికలు, ముగ్గురు బాలురు ఉన్నారు. విద్యార్థులను ఛైర్మన్ పైనం ఏడుకొండలురెడ్డి, కరస్పాండెంట్ సాయిరంగారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ కలువ సుభాష్‌చంద్రబోస్, ఏడీ శివప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ వందనశర్మ అభినందించారు. విద్యార్థుల కోసం ఎన్‌డీఏ పరీక్ష లాంటి డిఫెన్స్ కోచింగ్‌కు ఈ విద్యాసంవత్సరం నుంచి ఎన్‌డీఏ, సీడీఎస్, ఏఎఫ్‌సీఏటీ మొదలగు పోటీపరీక్షలకు అకాడమిక్ ప్రోగ్రామ్ మొదలుపెడుతున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఛైర్మన్ పైనం ఏడుకొండలురెడ్డి కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కర్లపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామసర్పంచ్ పీతా శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామంలో నేత్ర వైద్యులు గూడపల్లి ఎల్‌వి ప్రసాద్ ఉచిత శుక్ల వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్స్ కొల్లూరి సుచిత్ర, దామర్ల సరళి, పవన్‌కుమార్‌లు పాల్గొని 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మందికి శుక్లాల ఆపరేషన్, 20మందికి కళ్ళజోళ్ళు అవసరమన్నారు. శుక్లాలు ఆపరేషన్‌లకు అవసరమైన వారిని వాహనంలో తీసుకెళ్ళి ఆపరేషన్ అనంతరం ఇంటి వద్దనే వదలివెళుతారని తెలిపారు.

రేపు శ్రీ పోలేరమ్మ తిరునాళ్ళ

కర్లపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పాత నందాయపాలెం గ్రామంలో ఉన్న శ్రీ పోలేరమ్మ తిరునాళ్ళ మహోత్సవం ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 15వ తేదీన జలబిందెలు, 16వ తేదీన చద్ది నైవేద్యాలు, మల్లెపూల పూజలు, 17న అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పణ, అమ్మవారి నగరోత్సవం, 18న తేదీన అన్నదానం, 19వ తేదీన భక్తులు మొక్కుబడులు తీర్చుకుంటారని తెలిపారు.


పాతనందాయపాలెంలో ఉన్న శ్రీ పోలేరమ్మ

రైతులకు అవగాహన ఎక్కడ..?

గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద రైతులు పండించిన పంట శాంపిల్స్ ఇక్కడ పరీక్షించి, నాణ్యత తెలుసుకొని విత్తనాలకు విక్రయించుకునే అవకాశం ఉంది. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌లో 2,71,954 ఎకరాలు, రబీలో 3,25,961 ఎకరాలు సాగయ్యాయి. కానీ, ఇన్నేళ్లలో కేవలం 450 మంది రైతులు మాత్రమే అగ్రి ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకున్నారంటే అధికారులు రైతులకు ఏమేరకు అవగాహన కల్పిస్తున్నారో అర్థమవుతుంది. బాపట్ల ల్యాబ్‌లో ఏఈవో గొర్ల శ్రావణ బిందు సీడ్ పరీక్షలు చేస్తుంది. ఏడీఏ పర్యవేక్షణలో ఒక ఏవో, ఇద్దరు ఏఈవోలు ఇక్కడ పనిచేయాల్సి ఉంది. ఇక్కడకు ఎక్కువమంది రైతులు రావడం లేదని మిగిలిన వారిని డిప్యూటేషన్ మీద పంపించారు. వచ్చే ఖరీఫ్‌కు రైతులు ల్యాబ్‌ను వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

మత్స్యశాఖ ల్యాబ్

ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లోని ఓ విభాగంలో ఫిషరీస్ ల్యాబ్ ఉంది. ఇక్కడ ఒక ఎఫ్‌డీవోతో పాటు ఇద్దరు సాగర మిత్రలు పనిచేస్తున్నారు. ఆక్వా సాగు చేసే రైతులు ఇక్కడకు వచ్చి నీటిలో ఆక్సిజన్ పరిమాణం, క్షారత్వం, ఆమ్లత్వం, లవణీయత, మెగ్నీషియం, కాల్షియం, కాఠిన్యం, అమోనియం వంటి పరీక్షలు చేయించుకోవచ్చు. 2023లో దీనిని అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం 591 శాంపిల్స్ మాత్రమే రైతుల నుంచి వచ్చాయి. జిల్లాలో 20,389మంది రైతులు అధికారికంగా ఆక్వా సాగు చేస్తున్నారు. వీరంతా ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి, నష్టపోతున్నారు. చేపలు, రొయ్యల చెరువులలో సూర్యోదయానికి ముందు లీటరు నీరు తీసుకొని ల్యాబ్‌కు తీసుకొస్తే పరీక్షలు చేసి, ఫలితాలను చూపిస్తారు. లేదా అధికారులకు సమాచారం ఇస్తే వారే వచ్చి నీటిని తీసుకెళ్లి పరీక్ష చేసి, వివరాలు తెలియజేస్తారు.


బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవనం


విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్న ఏఈవో శ్రావణబిందు

అన్నీ ఉన్నా.. అవగాహనేదీ..?

- లక్ష్యం చేరని బాపట్ల ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- ఇక్కడే విత్తన, ఎరువు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు
- పశుసంవర్ధక, మత్స్య శాఖలకు ప్రత్యేక ల్యాబ్‌లు
- అవగాహన లేక ఆసక్తి చూపని రైతులు
- ఇంకా ప్రైవేట్ ల్యాబ్‌లకే ఆక్వా సాగుదారుల పరుగులు

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం తీసుకొచ్చిన ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు లక్ష్య సాధనలో వెనుకబడ్డాయి. ల్యాబ్ సేవలను కర్షకులు సద్వినియోగం చేసుకునేలా చేయడంలో పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తోంది. నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని ఎరువులు, పనిచేయని పురుగు మందులను గుర్తించాలంటే అన్నదాతలకు చాలా కష్టం. వీటి నాణ్యత తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ అగ్రి ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆక్వా సాగుకు ఊతమిచ్చేందుకు ఫిషరీస్ ల్యాబ్, పశువులకు కృత్రిమ గర్భధారణకు అవసరమైన పరీక్షల ల్యాబ్‌ను ఒకేచోట ఏర్పాటు చేసింది. బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణంలో నాబార్డు ఆర్‌కేవీవై నుండి రూ.90 లక్షల వెచ్చించి ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవన సముదాయ నిర్మాణం చేపట్టారు. అందులో పరీక్షలకు అవసరమైన విలువైన యంత్రపరికరాలు సమకూర్చడం జరిగింది. జిల్లాలోని బాపట్లతో పాటు రేపల్లె, చీరాల నియోజకవర్గాల్లో ఈ ల్యాబ్‌లు ఉన్నాయి.


పశుసంవర్ధక శాఖ విభాగంలో ఖాళీగా కుర్చీలు

పశుసంవర్ధక ల్యాబ్ ఊసేలేదు

బాపట్ల ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లో పశుసంవర్ధక శాఖకు ఓ ల్యాబ్‌ను కేటాయించారు. ఒక గదిలో అవసరమైన సామగ్రి ఏర్పాటు చేశారు. అయితే ఆ శాఖ అధికారులు.. అక్కడ ఉన్న పరికరాలు మొత్తం జిల్లా కార్యాలయం దగ్గర ఉన్న ల్యాబ్‌ను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. వీటిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన విధంగా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అధిక ఉత్పత్తుల సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరోసారి గుంటూరు మహిళకు..

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ
- ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- గతంలో నన్నపనేని రాజకుమారికి అవకాశం
- కమిషన్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి


డాక్టర్ రాయపాటి శైలజ


నన్నపనేని రాజకుమారి

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మహిళా హక్కులను కాపాడే కీలకమైన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో మరోసారి గుంటూరు జిల్లాకు దక్కింది. చట్టబద్ధమైన ఈ పదవిలో నియమితులైన వారిని పదవీకాలం పూర్తయ్యే వరకు తొలగించే హక్కు ఎవరికీ లేదు. మహిళలను ఎంతగానో గౌరవించే సీఎం చంద్రబాబు నాయుడు 2014లో అధికారంలోకి రాగానే నన్నపనేని రాజకుమారిని ఈ పదవికి ఎంపిక చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా, టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేసిన రాజకుమారి రాష్ట్రంలో ఎక్కడ ఏ మహిళకు ఆపద వచ్చినా హుటాహుటిన వెళ్లి బాధితులకు అండగా నిలిచారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికే వన్నె తెచ్చారు. మహిళల వివాహ వయసు 18 నుంచి 22 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వానికి రాజకుమారి సిఫారసు చేశారు. అప్పట్లో ఆమె పదవీకాలం ఐదేళ్లుగా నిర్ధారించటమే కాకుండా, కేబినెట్ హోదా కల్పిస్తూ చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే.. ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతో మూడున్నరేళ్లకే ఆమె తన పదవికి రాజీనామా చేశారు. తిరిగి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గుంటూరు జిల్లాకు చెందిన మహిళనే ఆ పదవికి ఎంపిక చేసింది. సీనియర్ పార్లమెంటేరియన్‌గా పేరొందిన వయోభారంతో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్న రాయపాటి సాంబశివరావు సోదరుడి కుమార్తె డాక్టర్ రాయపాటి శైలజకు ఈ పదవిని కట్టబెట్టారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన రైతుల ఉద్యమానికి శైలజ సంపూర్ణ సహకారం అందించారు. ఆమె పోరాట పటిమను గుర్తించిన చంద్రబాబు ఈ పదవికి ఎంపిక చేశారు. అయితే శైలజకు ప్రస్తుతానికి రెండేళ్ల పాటే పదవిలో కొనసాగే అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ హోదాను కూడా తదుపరి ఉత్తర్వుల్లో కల్పించే అవకాశం ఉంది. కాగా ఆమె పనితీరును బట్టి పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉన్నట్టు కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విశేషమేమిటంటే రాజకుమారి, శైలజకు బంధుత్వం ఉంది.

విద్యుత్‌శాఖలో బదిలీలపై సందిగ్ధం

- నూతన కార్యవర్గంతో తాత్కాలికంగా బ్రేక్
- కొత్త సర్కిల్స్‌కు ఉద్యోగుల విముఖత

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ సీపీడీసీఎల్)లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి సందిగ్ధంలో పడింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల సీపీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాను మూడు సర్కిల్స్‌గా విభజించారు. ఈ మేరకు ఉద్యోగుల విభజన ప్రక్రియలో తాత్సారం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో గుంటూరు సర్కిల్‌గా ఉన్న జిల్లాను గుంటూరు టౌన్-1 , తెనాలి డివిజన్‌తో కలిసి గుంటూరు సర్కిల్‌గా, నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లతో పల్నాడు సర్కిల్‌గా, బాపట్ల డివిజన్, అద్దంకి, చీరాల డివిజన్‌లతో బాపట్ల సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. సర్కిల్స్‌ను ఏర్పాటు చేసినప్పటికీ ఉద్యోగులు లేరు, కనీసం కంప్యూటర్లు వంటి మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితి నెలకొంది. కొత్త సర్కిల్స్‌లో ఉద్యోగులు తప్పనిసరి అని ఎస్‌ఈలు ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త సర్కిల్స్‌కు ఉద్యోగుల విభజన ప్రక్రియ చేపట్టాలని సంస్థ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇక ప్రక్రి య పూర్తయి బదిలీలకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో కొత్త కార్యవర్గం నియామకంతో తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

ఆదేశాలు జారీ చేసినా..

కొత్త సర్కిల్స్ విభజన నేపథ్యంలో గుంటూరు సర్కిల్ కార్యాలయం నుంచి 13 మంది పొరుగు సేవల ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసినా.. వారు వెళ్లని పరిస్థితి నెలకొంది. అసలే అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న తమను జిల్లాలు దాటించేలా బదిలీలు చేస్తే ఎలాఅని తొలి నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు.



బదిలీలకు బ్రేక్..

ప్రభుత్వం ఇటీవల ఏపీ సీపీడీసీఎల్ సీఎండీగా పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్‌గా ఆవుల మురళీకృష్ణయాదవ్‌తో పాటు ఇతర డైరక్టర్లతో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. దాంతో బదిలీల వ్యవహారం ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం సీఎండీ పుల్లారెడ్డి గతంలో ఎస్‌పీడీసీఎల్‌లో డైరక్టర్‌గా వ్యవహరించిన సీనియర్ అధికారి, డైరక్టర్‌గా మురళీ కృష్ణయాదవ్ కూడా క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలిసిన అధికారి కావడంతో ఉద్యోగుల బదిలీల వ్యవహారం ఎలా చేయాలన్న దానిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కూడా సంస్థలోని ఓ ఉద్యోగ సంఘం నాయకులు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కూడా ఉద్యోగుల బదిలీలతో కొంత వ్యతిరేకత ఉందని, ప్రస్తుతానికి నిలుపుదల చేయాలని కోరినట్లు సమాచారం. బదిలీల ప్రక్రియ తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టిన ట్లు తెలిసింది. త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తారని ఓ అధికారి తెలిపారు.

వేసవిలో ఫీవర్లు.. వైరల్

- ఆందోళన లేదంటున్న వైద్యవర్గాలు



గుంటూరు మెడికల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా వేసవి ముగిసి, తొలకరి ప్రారంభయ్యే జూన్‌లో విష జ్వరాలు విజృంభిస్తాయి. ఇవి సాధారంగా వైరల్ ఫీవర్లుగా (ఇన్‌ఫ్లూయెంజా వైరస్) వైద్యులు చెబుతారు. వాతావరణంలో సంభవించే మార్పుల కారణంగా ఇవి విజృంభిస్తాయి. ఎండలు మండుతున్న ప్రస్తుత తరుణంలోనూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైరల్ ఫీవర్లు వణికిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది నడి వేసవిలో వైరల్ జ్వరాలు ప్రబలడం విశేషం. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులే ఈ జ్వరాలకు కారణమని వైద్యులు చెబుతున్నారు. గత వారం జిల్లాలో కురిసిన వర్షాలు జ్వరాలకు కారణమవుతున్నట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఐదారు రోజులుగా జ్వరాలు జిల్లాను చుట్టుముట్టాయి. జ్వరం, జలుబు, ముక్కు కారడం, గొంతులో మంట, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరు రోగుల్లో వీటితో పాటు డయేరియా, ఒళ్లు నొప్పులు ఉంటున్నాయి.



జాగ్రత్తలు పాటిస్తే చాలు


డాక్టర్ రేవూరి హరికృష్ణ

వారం రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల ఓపీకి వస్తున్న జ్వర బాధితుల సంఖ్య పెరిగింది. రోగులు రెండు రోజుల పాటు బెడ్ రెస్ట్ తీసుకొని, ద్రవ పదార్థాలు అధికంగా సులువుగా కోలుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి అంత ప్రమాదకరం కాదని అమరావతి రోడ్‌లోని ప్రభుత్వ చాతి, శ్వాస కోస వ్యాధుల వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘు తెలిపారు. ఇవి సెల్ఫ్ లిమిటింగ్ ఫీవర్లు అని, మూడు, నాలుగు రోజుల్లో అవే తగ్గిపోతున్నాయని ఆయన వివరించారు. ప్లేట్ లెట్లు తగ్గడం, ఇతర ఇబ్బందికర పరిస్థితులు ఇప్పటి వరకు తాము గుర్తించలేదని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా ఫ్లూ వ్యాక్సినేషన్ చేయించుకోవడం ఉత్తమం అని అంటు వ్యాధుల వైద్యనిపుణులు రేవూరి హరికృష్ణ సూచిస్తున్నారు. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న ఈ వ్యాక్సిన్ తీసుకుంటే పూర్తి రణక్ష లభి స్తుందని చెబుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, చిత్రంలో సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో కృష్ణ

రూ. కోట్లలో ఆడిట్ అభ్యంతరాలు

- ఎంపీడీవోలపై జడ్పీ సీఈవో ఆగ్రహం
- వాడివేడిగా సాగిన సమీక్ష సమావేశం

గుంటూరు సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): 'నరసరావుపేటలో రూ. 2.60 కోట్లు.. మాచవరంలో రూ.కోటి.. గుంటూరు రూరల్ రూ.1.26 కోట్లు.. క్రోసూరు రూ.97 లక్షలు.. యడ్లపాడు రూ.80 లక్షలు.. ఏ మండల పరిషత్ చూసినా ఆడిట్ అభ్యంతరాలే.. అయినా ఎంపీడీఓలు పట్టించుకోవడం లేదు.. ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా అంటూ..' జడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో.. పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అధ్యక్షతన ఎంపీడీఓల సమీక్షా సమావేశం మంగళవారం వాడీవేడిగా కొనసాగింది. సీఈవో జ్యోతి బసు మాట్లాడుతూ ఎంపీడీవోలు బాధ్యత తీసుకొని ఆడిట్ అభ్యంతరాలు నిలుపుదల చేయించాలని సూచించారు. జడ్పీ ఆస్తుల పరిరక్షణపై డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ సమీక్ష నిర్వహిస్తూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది వివిధ రాజకీయ పార్టీల పేర్లు చెప్పి జిల్లా పరిషత్‌కు చెల్లించాల్సిన అద్దె బకాయిలు రూ.లక్షల్లో పెండింగ్ పెడుతున్నారని అన్నారు. పిడుగురాళ్ల జడ్పీ కాంప్లెక్స్ నుంచి గడచిన ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా అద్దె వసూలు కాలేదని చెప్పారు. అక్కడ రూ. 32 లక్షలు అద్దె బకాయి ఉందన్నారు. ఎంపీడీఓ అక్కడ కు వెళ్లి షాపులకు తాళాలు వేయాలని ఆదేశించారు. కొంతమంది జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ లోని గదులు రూ. 3 వేలకు అద్దెకు తీసుకొని రూ. 15 వేల అద్దెకు ఇస్తున్నారని వెల్లడించారు.

బల్లకట్టు తిరుగుతుంటే ఏం చేస్తున్నారు?

మాచవరం మండలం గోవిందా పురం బల్లకట్టు అనధికారికంగా తిప్పుతూ ఉండటం చర్చకు వచ్చింది. చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈఓ కృష్ణ దీనిపై స్పందిస్తూ.. జడ్పీ ఆదాయానికి గండి కొడుతుంటే ఎంపీడీఓలు అధికారులు పట్టీపట్టనట్లు ఉండటం విచారకరమన్నారు. గోవిందాపురం వ్యవహారం లో పోలీసులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని సూచించారు. జడ్పీ ఆస్తుల పరిరక్షణ బాధ్యత ఎంపీడీఓలదేనని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు.

జడ్పీ లేఖలకు రెక్కలు..!

జడ్పీ ఆస్తులకు సంబంధించిన వేలం పాటల వ్యవహారంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న విషయం చర్చకు వచ్చింది. సంబంధిత అధికారులు మాట్లాడుతూ దాచేపల్లి మండలంలోని ఇరికేపల్లి, పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూముల వేలానికి సంబంధించిన లేఖలు జడ్పీ నుంచి ఎప్పటికప్పుడు మండలాలకు పంపామని చెప్పారు. దాచేపల్లి మండల అధికారులు మాట్లాడుతూ తమకు ఏ విధమైన లేఖలు రాలేదని ప్రతిస్పందించారు. అయితే లేఖలను మధ్యలో కాకులు ఎత్తుకుపోతున్నాయేమో అని అధికారులు పేర్కొన్నారు.

నూజెండ్ల వ్యవహారం..

సమావేశంలో నూజెండ్ల మండల పరిషత్ వ్యవహారం చర్చకు వచ్చింది. సిబ్బంది తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. సిబ్బంది సరిగా విధులకు హాజరుకావడం లేదని, పైగా ఎంపీడీఓ వేధిస్తుంది అంటూ పత్రికల్లో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ ఉన్న సిబ్బందిని వెంటనే రీ-కాల్ చేయాలని ఎంపీడీఓ ఉమాదేవి జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.



డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆసుపత్రి భవనం

మాచర్ల కంటి వెలుగు

- డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆసుపత్రి సేవలు
- 46 వేల మందికి కంటి శస్త్ర చికిత్సలు
- సకల సదుపాయాలతో అధునాతన భవనం

మాచర్లటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని మాచర్లకు కంటి వెలుగైంది డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆసుపత్రి. సర్వేంద్రియానం నయనం ప్రధానం.. అన్న నినాదాన్ని అందిపుచ్చుకుని పేదలకు కంటి శస్త్ర చికిత్సలు అందిస్తోంది. ఈ నియోజకవర్గంలో సుమారు 80 గిరిజన తండాలున్నాయి. అధికంగా బడుగు, బలహీన వర్గాలే ఇక్కడ జీవిస్తున్నాయి. వయస్సుపై బడిన తర్వాత కంటి శుక్లాలు, కంటిలో పొరలు, నీటి కాసులు వంటి సమస్యలొస్తే.. శస్త్ర చికిత్సలు చేయించుకునే ఇక్కడి వారికి లేదు. గతంలో వీరికి రోటరీ క్లబ్ ద్వారా ఐ క్యాంపులు నిర్వహించి, అపరేషన్ అవసరమైన వారిని పాలకొల్లు పంపించేవారు. అలా కాకుండా వెనుకబడిన పల్నాడు ప్రాంతంలోనే ప్రజలకు వైద్య సేవలందాలని మాచర్ల పట్టణంలోని సాగర్ రోడ్డులో 63 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుత బాపట్ల జిల్లా అమృతలూరు గ్రామానికి చెందిన డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు వృత్తి రీత్యా అమెరికాలో స్థిరపడ్డప్పటికీ.. ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ. 3 కోట్లు విరాళంగా అందించారు. ఇంకో రూ. 5 కోట్ల నగదు దాతల నుంచి అందింది. దీంతో 2006లో డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆసుపత్రిని నిర్మించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో శంకర కంటి ఆసుపత్రి తర్వాత ఆ స్థాయిలో ఇక్కడే సేవలు నిరుపేదలకు అందుతున్నాయి.


45 వేల కంటి శస్త్ర చికిత్సలు

ఆసుపత్రిలో ఇప్పటికి 45 వేల మందికి కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. నీటి కాసుల పరీక్షలు, సీజన్లో వచ్చే అంటు వ్యాధుల ట్రీట్‌మెంట్ కూడా కొనసాగిస్తున్నారు. హాస్పిటల్‌లో అధునాతనమైన థియేటర్‌లో ల్యామినార్, సాధారణ థియేటర్‌లు ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో నుంచి 20 పడకల ఆసుపత్రి అనుమతి కూడా లభించింది. ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ సదుపాయాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. డిస్ట్రిక్ బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ అనుసంధానంతో ఆధార్ కార్డు ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఎన్‌పీసీబీ (నేషనల్ ప్రోగ్రాం కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్)తో అనుసంధానం చేయడం జరిగింది. పార్మసీ, అధునాతన ల్యాబ్, కళ్లజోళ్ల షాపు, రక్త పరీక్షల ల్యాబ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇద్దరు డాక్టర్లు, 31 మంది స్టాఫ్‌తో నిరంతర సేవలు అందిస్తున్నారు.


డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి దంపతులు

దాతృత్వంతో..ముందుకు

-చిరుమామిళ్ల కృష్ణయ్య
ఆసుపత్రి కమిటీ చైర్మన్



డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆసుపత్రి కమిటీ చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య దాతల నుంచి సేకరించిన నగదుతో ఆసుపత్రిని కార్పోరేట్ స్థాయిలో నిలబెట్టారు. విరాళాల్లో కొంత భాగాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగిస్తున్నారు. ఎస్‌బీఐ ద్వారా సీఎస్ఆర్ గ్రాంటు రూ.70 లక్షల నిధులతో రెటీనా మిషన్ పరికరాలు అందజేశారు. చైర్మన్‌తో పాటు, కమిటీ సభ్యులు దాతల నుంచి భారీగా విరాళాలు సేకరించి, కార్పొరేట్ స్థాయిలో ఇక్కడ కంటి వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నారు.

మరమ్మతులకు.. మోక్షం

(5వ పేజీ తరువాయి)

చేయలేదు. రైతుల చెల్లించిన నీటి తీరువా ఆధారంగా విడుదల చేసే ఓఅండ్ఎం నిధులనూ ఇవ్వలేదు. ఓఅండ్ఎం నిధులు ఏటా రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు అవసరమని ప్రతిపాదనలు పంపితే రూ.7 నుంచి రూ.11 కోట్లు మాత్రమే మంజూరు చేసేది. ఆ నిధులను ఖరీఫ్ సీజన్ మొదలయ్యే తరుణంలో విడుదల చేయడం.. గడువులోపు పూర్తిచేయలేకపోయారంటూ వెనక్కు తీసుకోవడం పరిపాటిగా మారింది. అరకొర పనులతో మమ అనిపించి నిధులను దోచేసిన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో గడచిన ఐదేళ్లు సాగునీటి కష్టాలతో రైతులు అల్లాడిపోయారు. నీరు లేనప్పుడు నీటి కష్టాలు వెంటాడితే, వర్షాలు ఎక్కువగా పడిన సమయంలో నీరు ఎక్కువై కాల్వలకు గండ్లుపడి, పంటలను తుడిచిపెట్టేసిన పరిస్థితులున్నాయి. సజావుగా పంట పండుతుందన్న నమ్మకంలేక పొలాలను ఖాళీగా వదిలేసిన సందర్భాలున్నాయి.

రేపు అమ్మనబ్రోలుకు మంత్రి లోకేష్

వీరయ్యచౌదరి కుటుంబానికి పరామర్శ

ఒంగోలు, మే 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు రానున్నారు. ఇటీవల దారుణ హత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించనున్నారు. గతనెల 22వ తేదీ రాత్రి వీరయ్య చౌదరి ఒంగోలులోని తన కార్యాలయంలో హత్యకు గురైన విషయం విదితమే. ఆమరుసటి రోజున స్వగ్రామమైన అమ్మనబ్రోలులో అంత్యక్రియలు జరగ్గా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చి వీరయ్య చౌదరికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈనెల 8న నిర్వహించిన వీరయ్యచౌదరి దశదిన కర్మకు మంత్రి నారా లోకేష్ వస్తారని ప్రచారం జరిగింది. ఆరోజున రాష్ట్ర మంత్రి వర్గసమావేశం ఉండటంతో రాలేకపోయారని సమాచారం. ఈనేపథ్యంలో గురువారం ఆయన వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్నారు. ఆ మేరకు అధికారికంగా ఇటు పార్టీ నేతలకు, అటు అధికార యంత్రాంగానికి సమాచారం అందింది. లోకేష్ గురువారం ఉదయం 8గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 8.45 గంటలకు నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 9 గంటలకు బయల్దేరి 9.20 గంటలకు అమ్మనబ్రోలుకు వెళ్తారు. 9.30 నుంచి 10 గంటల వరకూ వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. తిరిగి 10.50 గంటలకు చదలవాడ హెలిప్యాడ్‌కు చేరుకొని 11 గంటలకు హెలికాప్టర్‌లో అనంతపురం జిల్లా గుత్తికి వెళ్తారు.

4 వేలమంది టీచర్లకు స్థానచలనం

ఖాళీలపై కసరత్తు పూర్తి

పాఠశాల విద్య కమిషనర్ వెబ్‌సైట్‌లో వివరాలు

ఒంగోలు విద్య, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో త్వరలో చేపట్టనున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన కసరత్తు పూర్తయ్యింది. సుమారు 4వేల మందికి స్థానచలనం కలగనుంది. 2017లో జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన టీచర్లందరూ ప్రస్తుత బదిలీ కావాల్సి ఉంది. ఒకేచోట ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న హెచ్ఎంలు, ఎనిమిదేళ్లు పూర్తయిన ఇతర టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారి జాబితాలో ఉన్నారు. పాఠశాలల్లో మిగులుగా తేలిన టీచర్లందరూ బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సిందే. మెరుగైన స్థానాలకు బదిలీ కోరుకొనే జాబితాలో 4వేల మంది ఉన్నారు. బదిలీ అయ్యేవారిలో సింహభాగం సెకండరీ గ్రేడ్ టీచర్లే. జిల్లాలోని మొత్తం టీచర్లలో సుమారు మూడోవంతు మందికి స్థానచలనం కలగనుంది.

ఖాళీలు ఇలా..

ప్రస్తుతం ఉన్న క్లియర్ వేకెన్సీలు, మే 31 నాటికి ఉద్యోగ విరమణ ద్వారా వచ్చే ఖాళీలు, ఒకే పాఠశాలలో ఐదేళ్లు పూర్తయిన హెచ్ఎంలు, 8 సంవత్సరాలు పూర్తయిన టీచర్ల స్థానాలను ఖాళీలుగా చూపించారు. ఒక పాఠశాలలో మిగులుగా తేలిన టీచర్లను అవసరమున్న చోటుకు సర్దుబాటు చేసి ఆస్థానాలను ఖాళీలుగా చూపించారు. స్టడీ లీవ్, పొరుగు సేవలు, అనధికారికంగా గైర్హాజరైన టీచర్ల స్థానాలను ఖాళీలుగా ప్రకటించారు. 1998, 2008 డీఎస్సీ వారు కాంట్రాక్టు విధానంతో మినిమం టైం స్కేలుతో పనిచేస్తున్న టీచర్ల స్థానాలన్నింటినీ ఖాళీలుగా చూపించారు. దివ్యాంగ టీచర్లతోపాటు, ఎగనెస్ట్ పోస్టుల్లో పనిచేస్తున్న వారి స్థానాలను ఖాళీగా చూపించలేదు. ఖాళీల వివరాలను పాఠశాల విద్య కమిషనర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.



ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం

పంగులూరులో ముగిసిన సంబరాలు

పంగులూరు, మే 13(ఆంధ్రజ్యోతి): పంగులూరులో శ్రీ పార్వతీ సమేత శ్రీ భీమలింగేశ్వరస్వామి 21వ వార్షికోత్సవ సంబరాలు ముగిశాయి. మంగళవారం బలిహరణ, వసంతసేవ, త్రిశూల స్నానం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలను బ్రహ్మశ్రీ పేటేటి ఉదయభాస్కరశర్మ, ఆలయ అర్చకులు సునీల్‌శర్మ, సాంబశివరావులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పలువురు దంపతులు పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీసాయి నాట్య కళాభారతి, ఎస్.సరస్వతి శిష్య బృందం ఒంగోలు వారు నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనతో కార్యక్రమాలు ముగిశాయి.

రాతి మండపం నిర్మాణం, మారుతీభవన్ గదుల అభివృద్ధికి విరాళాలు

అద్దంకి, మే13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి మండపం, మారుతీ భవన్‌లో గదుల అభివృద్ధికి పలువురు దాతలు మంగళవారం విరాళాలు అందజేశారు. మారుతీ భవన్‌లో రెండు గదులలో ఏసీ, డబుల్‌కాట్ మంచం, బెడ్,గీజర్‌ల ఏర్పాటుకు అద్దంకి మండలం కొంగపాడుకు చెందిన నర్రా హనుమయ్య, రాధిక దంపతులు, మాజీ సర్పంచ్ కరి వెంకటసుబ్బయ్య, సుబ్బాయమ్మ దంపతులు విరాళాలు అందజేశారు. రాతి మండపం నిర్మాణానికి కొరిశపాడు మండలం రావినూతలకు చెందిన గొట్టిపాటి సురేష్, హేమంత్‌లు 1,00,108 రూపాయలు, నెల్లూరు జిల్లా రామలింగాపురానికి చెందిన పుచ్చలపల్లి పవన్‌కుమార్ దంపతులు 1,11,116 రూపాయలు విరాళం అందజేశారు.



విరాళం రసీదు ఈవో నుంచి తీసుకుంటున్న నర్రా హనుమయ్య, రాధిక దంపతులు

రెండు ఉచిత బస్‌ల ఏర్పాటు

శింగరకొండలో మహాకుంభాభిషేకం కార్యక్రమాలు బుధవారం నుంచి 19వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో దేవాలయం ముందు గుండా రాకపోకలు నిలిపి వేయనున్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. భక్తులు రాకపోకలు సాగించేందుకు నామ్ రోడ్డులో 99 అడుగుల అంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి దేవాలయం వరకు భవిష్య స్కూల్ సహకారంతో రెండు ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.

నేడు హుండీల కానుకల లెక్కింపు

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలోని హుండీల కానుకలను బుధవారం ఉదయం లెక్కించనున్నట్లు ఈవో చెప్పారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల



ఆలయప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ

చినగంజాం, మే 3(ఆంధ్రజ్యోతి) : కడవకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ వారి తిరునాళ్లను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి బ్రహ్మయ్య అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు విశేష పూజలు జరిపి, మెక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం, సాయంత్రం గ్రామంలో మహిళలు పోతురాజు విగ్రహం వద్ద పూజలు నిర్వహించి చద్ది, వడపప్పు, పానకాలను తీసుకుని మేళతాళలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. సాయంత్రం పోలేరమ్మ వారి ప్రభను టైరు బండిపై అలంకరించి, పురవీధుల గుండా బాణసంచా, మేళతాళాలు, కనకతప్పెట్లు, యువకుల నృత్యాల నడుమ ఊరేగింపుగా గుడి వద్దకు చేర్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సత్యహరిశ్చంద్ర నాటకం ఆకట్టుకుంది.అలాగే భారీ విద్యుత్ ప్రభల వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.



పొంగళ్లతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలేరమ్మ వారి 70 అడుగుల కటౌట్ తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతడీపీవో వెంకటనారాయణ రెడ్డి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసైనికులు తిరునాళ్లకు వచ్చే భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. గ్రామ కాపులు నామన లక్ష్మణరావు, నాగిరెడ్డి నాగేశ్వరరావు, బొప్పన పూర్ణచంద్రరావు, గొల్లపూడి సూర్యం, బత్తిన రామస్వామి, గాజుల వెంకటేశ్వర్లు, పొట్టి భాస్కరరావు, సూరగాని రామకృష్ణ, సిద్ధాబత్తిన భాస్కర్, తోట శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఆలయప్రాంగణంలో అమ్మవారి కటౌట్

కూలీల బతుకుల్లో చీకట్లు

రెండు కుటుంబాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

వారిలో భార్యాభర్తల జంటలు

అనాథలైన పిల్లలు



రోదిస్తున్న సుబ్బమ్మ కుటుంబసభ్యులు



పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మ (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్ మే 13 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం కూలి పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగించే కుటుంబాల బతుకులు చీకటయ్యాయి. ఒకే గ్రామంలో రెండు కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. దీంతో వారి పిల్లలు అనాథలయ్యారు. ఎర్రగొండపాలెం మండలంలోని గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన పలువురు కూలీలు పనుల కోసం పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలో బొప్పాయి కాయలు కోసేందుకు రెండు వాహనాల్లో మంగళవారం ఉదయం గ్రామం నుంచి బయలుదేరారు. అప్పటి వరకు సరదాగా మాట్లాడుకుంటున్న వారి జీవితాల్లోకి ప్రమాదం మంచుకొచ్చింది. వినుకొండ మండలం శివాపురం సమీపంలో జాతీయ రహదారిలో బొలోరోను వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన పగడాల సుబ్బమ్మ (38), బొట్టు అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన పగడాల రమణారెడ్డి(45)ని బొట్టు రామాంజి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. అయితే ఒకే గ్రామానికి చెందిన వీరు నలుగురిలో రెండేసి జంటలు(భార్యాభర్తలు) కావడంతో విషాదఛాయలు అలముకున్నాయి.

అనాథలైన చిన్నారులు

బొట్టు అంకమ్మది గడ్డమీదపల్లి స్వగ్రామం. కాగా పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం దాపల్లె గ్రామానికి చెందిన రామాంజితో వివాహం జరిగింది. అయితే అక్కడి నుంచి అంకమ్మ స్వగ్రామానికి కుటుంబంతో వచ్చారు. ఇక్కడే ఇద్దరు కూలి పనులకు వెళ్తా జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు, ఆరేళ్ల పవన్‌కుమార్, నాలుగు సంవత్సరాల నాగచైతన్య ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలుగా మారారు. వారి మృతదేహాలను స్వగ్రామం దాపల్లెకు వినుకొండ నుంచి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.



అనాథలైన అంకమ్మ, రామాంజి పిల్లలు

పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద అమ్మాయికి వివాహం అయింది. బాబు వెంకటరెడ్డి బీఫార్మసీ చదువుతున్నాడు. మరో అమ్మాయి నవిత ఇంటర్ పూర్తి చేసింది. తల్లిదండ్రులు మృత్యువాత పడడంతో వారు పెద్ద దిక్కు లేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. మృతదేహాలను చూసేందుకు గ్రామ ప్రజలు తరలివచ్చారు.

త్రుటిలో తప్పింది

గ్రామానికి చెందిన 12 మంది కూలీలు రెండు వాహనాల్లో నరసరావుపేటకు బొప్పాయి కాయలు కోసేందుకు బయలు దేరారు. శివాపురం సమీపంలో జాతీయ రహదారిలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను దాటివెళ్లిన మరుక్షణమే పెద్ద శబ్దం వినిపించింది. ఆపి చేసేసరికి వెనుక కూలీలతో వస్తున్న బొలేరోను వ్యాన్ ఢీకొట్టిందని కూలీలు తెలిపారు. నిమిషం వ్యవధిలో ప్రమాదం నుంచి మేము తప్పించుకున్నా వెనుక వస్తున్న మా తోటి కూలీలు మృత్యువాతపడ్డారని వారు విలపిస్తున్నారు.



అంకమ్మ, రామాంజి(ఫైల్)

జీవ ధ్వజస్తంభం నగరోత్సవం



నగరోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో, దాత శంకరారెడ్డి కుటుంబసభ్యులు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద పునఃప్రతిష్ఠ చేయనున్న జీవ ధ్వజస్తంభం నగరోత్సవం మంగళవారం రాత్రి అద్దంకి పట్టణంలో వైభవంగా సాగింది. ఈ నెల 19వ తేదీ జీవ ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరగనుండగా బుధవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని నంబూరివారిపాలెం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కాకానిపాలెం, పాతబస్టాండ్, పాత గాంధీ బొమ్మసెంటర్, భవానీసెంటర్ మీదుగా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వరకు సాగింది. ఈవో తిమ్మానాయుడు, ధ్వజస్తంభం దాత మేదరమెట్ల శంకరారెడ్డి, కుటుంబసభ్యులు, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సభ్యత్వానికి జంజనం రాజీనామా

గతనెల 29నే జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం ఇన్‌చార్జికి పంపినట్లు సోషల్ మీడియాలో వైరల్

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై బుధవారం అవిశ్వాస బల నిరూపణ జరగనుంది. అందుకు సంబంధించి జిల్లా అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. గతనెల 30న జంజనం శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం జరిగిన రాజకీయ సమావేశాల్లో ఎక్కడా కూడా జంజనం వైసీపీకి రాజీనామా చేసినట్లు ప్రస్తావన జరగలేదు. ఆఖరికి ఇటీవల చైర్మన్ ఆయన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సైతం రాజీనామా విషయం ప్రస్తావించనప్పటికీ వెసులుబాటు సమయంలో రాజీనామా చేస్తానని స్పష్టంగా చెప్పారు. మంగళవారం ఆయన అనుయాయులు సోషల్ మాధ్యమాల్లో చైర్మన్ రాజీనామా పత్రం వైరల్ చేయడం, అందులోనే గత నెల 29వ తేదీ ఉండటంపై రాజకీయంలో భాగమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అంగన్వాడీలో సాధ్యం



చిన్నారులకు సర్టిఫికెట్‌లను అందిస్తున్న సీడీపీవో ఝాన్సీ

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు విద్యతో పాటు ఆటలపై మక్కువ పెంచే విధంగా బోధన అందించడం అంగన్వాడీల నుండే సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీ చెప్పారు. మంగళవారం మునిసిపల్ పరిధిలోని శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐటీసీ బంగారు భవిష్యత్, ప్రథమ్ ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత ఉత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్యపూర్తి చేసిన విద్యార్థులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. సమగ్ర అభివృద్ధి స్టాల్ వద్ద చిన్నారుల వ్యక్తిగత నైపుణ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కోటేశ్వరమ్మ



కోటేశ్వరమ్మ

అద్దంకిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా యు. కోటేశ్వరమ్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సత్తెనపల్లి జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన సుబ్బారావు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అద్దంకిలో జరుగుతున్న ఇంటర్ మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాలను ఆర్‌జేడీ జగన్నాథం పద్మ పరిశీలించారు.

రోటరీ ఆధ్వర్యంలో నేత్రదానం

ఇంకొల్లు, మే 12, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నేత్రదానం జరిగింది. కోలలపూడి గ్రామానికి చెందిన కందిమళ్ల సుబ్బారావు(82) మృతి చెందగా కుటుంబసభ్యులు అన్నపూర్ణమ్మ, అనంతలక్ష్మీ, అంజమ్మ, రంగబాబుల సహకారంతో గుంటూరు శంకర కంటి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుడి కుటుంబ సభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీ సభ్యులు అభినందించారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమంలో జనసేనానులు

పర్చూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ నాయకులు శంకరశెట్టి చిరంజీవి కోరారు. మంగవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు విన్నకోట అజేయ్, మదపాటి కిషోర్, సాగిరి శ్రీనివాస్, సందు శ్రీనివాస్, యద్దనపూడి గినిపిశెట్టి అయ్యప్ప పాల్గొన్నారు.

ఐదు రోజులు.. 5,828 దరఖాస్తులు

రైస్ కార్డుల కోసం భారీగా దాఖలు

కొత్తవి కోరుతూ వచ్చినవి 1,015

పేర్ల చేర్పుల కోసం 4,087..

ఇతరత్రా మరికొన్ని

ఒంగోలు కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కొత్త రైస్ కార్డులు.. ప్రస్తుతం ఉన్న వాటిలో చేర్పులు, మార్పుల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకూ 5,828 దాఖలయ్యాయి. ఏడాదిన్నరగా రేషన్ కార్డుల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అదేసమయంలో గత వైసీపీ ప్రభుత్వం చేర్పులు, మార్పులకు అవకాశం ఇవ్వకపోవడంతో అనేక మంది ఇబ్బందులు పడ్డారు. దీన్ని గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం కొత్త రైస్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. చేర్పులు, మార్పులకు కూడా అనుమతిచ్చింది. దీంతో అర్హులైన వారు ఒంగోలు అర్బన్‌తోపాటు జిల్లాలోని 38 మండలాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. కార్డులో పేరు నమోదు (యాడింగ్) కోసం అత్యధికంగా 4,087 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్త రైస్ కార్డు కోసం 1,015 వచ్చాయి. కార్డు బదిలీకి 473 అందాయి. ఆధార్ సవరణ కోసం 105, అడ్రసు మార్పు కోరుతూ మరో 27 దాఖలయ్యాయి. అత్యధికంగా మార్కాపురం మండలంలో ఇప్పటి వరకు 350 దరఖాస్తులు వచ్చాయి. ఒంగోలు అర్బన్‌లో 328, ఎర్రగొండపాలెం మండలంలో 321, పుల్లలచెరువులో 314, కనిగిరిలో 240, పొదిలిలో 224, చీమకుర్తిలో 223, సంతనూతలపాడులో 204 దాఖలయ్యాయి. కొత్తపట్నం మండలంలో 190, కురిచేడులో 185, త్రిపురాంతకంలో 184, మద్దిపాడులో 183, సింగరాయకొండలో 169, దర్శిలో 165 దరఖాస్తులు వచ్చాయి. ఇతర అన్ని మండలాల్లో 50నుంచి 150 మంది వరకూ దరఖాస్తు చేసుకున్నారు.

కొండంత దోపిడీ

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి క్షేత్రంలో పూజాసామగ్రి ధరలు ఇష్టారాజ్యం

అధికారుల పర్యవేక్షణ శూన్యం

బెంబేలెత్తుతున్న భక్తులు



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ఉన్న దుకాణాలు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు పూజా సామగ్రి ధరలు విని బెంబేలెత్తిపోతున్నారు. ఇవెక్కడ ధరలరా బాబూ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు అత్యధిక శాతం కొబ్బరికాయ కొడతారు. వ్యాపారులు కొబ్బరికాయ ధరలను ఇష్టానుసారంగా నిర్ణయించి వసూలు చేస్తున్నారు.

వాహన పూజ సామగ్రి మరీ భారం

సాధారణంగా బయట మార్కెట్‌లో కొబ్బరికాయ, అగరబత్తీలు, కర్పూరం కలిపి 40 నుంచి 50 రూపాయలకు లభ్యమవుతుండగా, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద దుకాణాలలో మాత్రం 60 నుంచి 70 రూపాయలు వసూలు చేస్తున్నారు. వాహన పూజ, ఆకు పూజల సామగ్రి ధరలకు ఇక హద్దే లేకుండా పోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల వద్ద ధరల పట్టికను దేవాలయం అధికారులు ఏర్పాటు చేసినా అలంకారప్రాయంగా మారింది. కొబ్బరికాయలను సైజుల వారీగా 25 నుంచి 40 రూపాయలకు అమ్మాల్సి ఉండగా చిన్న కొబ్బరికాయలను సైతం 60 రూపాయలకు విక్రయిస్తున్నారు. అంటే రెట్టింపు ధర వసూలు చేస్తున్నారు. పలువురు భక్తులు ప్రశ్నిస్తే ఎదురు దాడి చేసే విధంగా మాట్లాడుతుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు.



దుకాణం వద్ద బోర్డు పై పూజాసామగ్రి ధరలు

ఇప్పటికైనా అధికారులు స్పందించి ధరల పట్టికలోని ధరలకే అమ్మే విధంగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. మహాకుంభాభిషేకం పూజా కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానుండటంతో ధరలు మరింత పెంచడం ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. 19వ తేదీన జరిగే మహాకుంభాభిషేకానికి వేల సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పూజా సామగ్రి ధరలను కచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఈవో తిమ్మానాయుడును వివరణ కోరగా దుకాణదారులను విచారించి నిర్దేశించిన ధరలతోనే అమ్మకాలు చేసే విధంగా చర్యలు తీసుకుంటమని చెప్పారు.



టీటీడీ కల్యాణ మండపం నుంచి వచ్చే దారికి అడ్డుగా నిర్మాణం చేసేందుకు తోలిన ఇసుక

అభివృద్ధికి అడ్డంకులు

- శింగరకొండలో దాతల సహకారంతో ఒక వైపు అభివృద్ధి పనులు..
- మరో వైపు దేవస్థానం భూమి కబ్జాకు యత్నాలు

మూడు దశాబ్దాల క్రితం రెవెన్యూ శాఖకు నగదు చెల్లించి 8.54 ఎకరాలు కొనుగోలు చేసిన ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం అధికారులు

రెవెన్యూ అధికారుల ఇళ్ల స్థలాల పట్టాలంటూ ఇబ్బందులు పెడుతున్న కొందరు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ పుణ్యక్షేత్రంలో ఒకవైపు అభివృద్ధి పరుగులు పెడుతుంటే.. మరోవైపు ఆక్రమణలు కూడా అదే స్థాయిలో వెలుస్తున్నాయి. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రభుత్వంతోపాటు దాతల సహకారంతో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆ సమయంలో కొందరు రాజకీయ అండదండలతో దేవస్థానం భూమిని కబ్జా చేస్తుండడం గమనార్హం.

రికార్డుల్లో దేవదాయ శాఖ భూమిగా ఉన్నా సరే..

శింగరకొండ దేవస్థానం అధికారులు 1995లో సుమారు 8.55 ఎకరాలను రెవెన్యూ శాఖ నుంచి కొనుగోలు చేశారు. అనంతరం పలుసార్లు సర్వే చేసి హద్దులు కూడా తేల్చారు. దేవదాయశాఖ భూమిగా రెవెన్యూ అధికారులు నిర్ధారించినా కొంత మంది నివాస గృహాల, ఖాళీ స్థలాల యజమానులు మాత్రం దేవదాయశాఖ అధికారుల పనులను అడ్డుకుంటున్నారు.

అప్పటికప్పుడు కట్టడాలు

శింగరకొండలో ఇప్పటికే పెద్దఎత్తున మహాకుంభాభిషేకం పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో ఆక్రమణదారుల మరింత రెచ్చిపోయి టీటీడీ కల్యాణ మండపం నుంచి రోడ్డుకు వచ్చేందుకు దారి ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఇప్పటికిప్పుడు అడ్డుగా కట్టడాలు కట్టేందుకు సిద్ధం కావటం గమనార్హం. రెవెన్యూ అధికారులు గతంలో కొంతమందికి నివేశన స్థలాల పట్టాలు ఇవ్వటంతో వాటిని చూపించి అభివృద్ధి పనులు అడ్డుకుంటున్నారు.



టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న ఇళ్లు

రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి దేవాలయ అభివృద్ధి పనులు, మహాకుంభాభిషేకం పనులకు అడ్డంగా ఉన్న నివాసాలు, స్థలాలను ఖాళీ చేయించాలని భక్తులు కోరుతున్నారు. వారిలో నిజంగా అర్హులుగా ఉంటే వేరే ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కూడా సూచిస్తున్నారు. ఈ విషయమై దేవాలయ అధికారులు కూడా మీన మేషాలు లెక్కిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై ఈవో తిమ్మానాయుడును వివరణ కోరగా రెవెన్యూ, పోలీస్ అధికారుల సహాయంతో ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు.

పుణ్యక్షేత్రానికి గొర్రెల మంద.. ప్రత్యేక పూజలు

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి గొర్రెల కాపరులు తమ గొర్రెల మందలతో వచ్చి పూజలు చేసుకుంటారు. ఈ క్రమంలో మంగళవారం ముండ్లమూరు మండలం వేంపాడుకు చెందిన పలువురు గొర్రెలకాపరులు తమ గొర్రెలతో వచ్చి గులాములు చల్లి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. పొంగళ్లు పెట్టుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం చుట్టూ గొర్రెల మంద బారు తీరి ఉండటం తో పలువురు భక్తులు ఆసక్తిగా గమనించారు.



దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న గొర్రెల మంద

గ్యాస్ సిలిండర్ పేలి దుకాణం దగ్ధం

అవీఇవీ

తప్పిన పెను ప్రమాదం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన దుకాణం

పర్చూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని చెంచులకాలనీ సమీపంలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఓ దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలటంతో మంటలు చెలరేగి దుకాణం మొత్తం దగ్ధమైంది. నిత్యం వందల మంది ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారి వెంబడి అగ్ని ప్రమాదం చోటుచేసుకోవటం, దుకాణంలో ఉన్న సిలిండర్ పేలటంతో ఆ శబ్దానికి ప్రజలు ఆందోళనకు గురై ఉరుకులు పరుగులు తీశారు. ప్రమాదంలో దుకాణంపై ఉన్న సిమెంట్ రేకులు ఆకాశంలోకి ఎగిరి రోడ్డుపై పడ్డాయి. కాలనీ వాసులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న చీరాల ఫైర్ సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రమాద సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవటం, ఎలాంటి ప్రాణహాని జరగకపోవటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దుకాణంలో ఉన్న పొట్టుపొయ్యిలో మంటలు చెలరేగి గ్యాస్ సిలిండర్‌కు అంటుకోవటం వల్లే ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

హైవేపై అదుపుతప్పి బోల్తాకొట్టిన కోడిగుడ్ల లారీ



ముప్పవరం సమీపంలో తిరగబడిన కోడిగుడ్ల లారీ

పంగులూరు, మే 13(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కోడిగుడ్లతో వెళుతున్న లారీ అదుపుతప్పి తిరగబడింది. మండలంలోని ముప్పవరం టీడీపీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. కోడిగుడ్ల లోడుతో బోయపాలెం నుంచి టంగుటూరు వెళుతూ ముందున్న వాహనాన్ని దాటే ప్రయత్నంలో అదుపు తప్పింది. ఎవరికీ గాయాలు కాలేదు. వాహనంలోని కోడిగుడ్లన్నీ పగిలిపోయి నష్టం వాటిల్లింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా హైవే సిబ్బంది చర్యలు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాకతీయ కమ్మ సత్రం సమీపంలో రోడ్డు పక్కన చెట్టు కింద మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించార. వివరాలు తెలిస్తే 9121102167 నెంబర్ కు సమాచారం అందించాలని సీఐ సుబ్బరాజు తెలిపారు.

కౌలు రైతు కుటుంబానికి పరామర్శ

వీరన్నపాలెం(పర్చూరు), మే 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని వీరన్నపాలేనికి చెందిన ఉప్పుటూరి సాంబయ్య కుటుంబాన్ని వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, నియోజకవర్గ ఇన్‌చార్జి గాదే మధుసూదన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. రూ.50వేల నగదును మృతిని భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవనం శ్రీనివాస రెడ్డి, ఉప్పలపాటి అనిల్, కోటా శ్రీనివాసరవు, జెట్టి చంద్రం, ముప్పాళ్ల రాఘవయ్య, దాసరి వెంకటరావు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో నిర్మాణం అడ్డుకున్న వారిపై కేసు

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆటో నగర్‌లో నివాసం ఏర్పాటు చేసుకుంటున్న వారిని బెదిరించిన ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆటోనగర్‌లోని స్వర్ణపాలేనికి చెందిన కొప్పవరపు శ్రీనివాసరావు ఇటీవల నిర్మాణం ఏర్పాటు చేసుకొంటుండగా స్తూవర్టుపురానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో బాధితునికి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

‘ప్రజల నమ్మకానికి ఏడాది పూర్తి’

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : 'నాపై నియోజకవర్గ ప్రజలు నమ్మకముంచి నాకు ఓటు వేసి మంగళవారంతో ఏడాది అయింది. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా'నని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. గత అసెంబ్లీ పోలింగ్ జరిగి ఏడాది కావడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కొత్తపేట పోలింగ్ కేంద్రం 156లో ఓటు వేసి బయటకు వస్తున్న ఫొటోను సోషల్ మాధ్యమంలో విడుదల చేసి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నాను.. కానీ పార్టీ ఆదరించింది.. ప్రజలు విశ్వసించారు.. త్రికోణ ఉత్కంఠ పోరులో ప్రజానుబంధంతో విజయాన్ని అందుకున్నాను.. ఎక్కడ రాజీ పడను.. ప్రజలకు అండగా ఉంటాను.. టీడీపీ కూటమితో అభివృద్ధికే ముందడుగు వేస్తా'నని ఈసందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య వ్యక్తం చేశారు.



గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని బయటకు వస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు(ఫైల్)

కౌలుదారు కార్డుల ప్రాధాన్యతను గుర్తించండి

పంగులూరు, మే 13(ఆంధ్రజ్యోతి) : ప్రతి కౌలురైతు సీసీఆర్‌సీ కార్డు ప్రాధాన్యతను గుర్తించాలని, ఈ నెల 31వ తేదీవు దానిని పొందాలని తహసీల్దార్ సింగారావు చెప్పారు. మండలంలోని రామకూరు గ్రామంలో మంగళవారం కౌలురైతులకు సీసీఆర్సీ కార్డులపై గ్రామసభ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. పంటరుణం పొందాలన్నా, రైతు భరోసాతో పాటు ఇతర ప్రభుత్వ రాయతీలు కౌలురైతుకు లభించాలన్నా గుర్తింపు కార్డు కలిగిఉండాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్వేత, వీఆర్వో బాబయ్య పాల్గొన్నారు.



కౌలుదారు కార్డుల ప్రాధాన్యతను వివరిస్తున్న తహసీల్దార్ సింగారావు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో డి.సుబ్బారెడ్డి ఆదేశించారు. మండలంలోని రామకూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ నిర్వహించి ఖరీఫ్ ప్రణాళిక తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ సింగారావు, వీపీవో పృథ్వీ, ఎస్‌ఎఫ్‌ఎల్- 2 రాజశేఖర్, ఆర్‌పీలు రమేష్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో గోశాలకు దాణా అందజేత




దాణాను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): రోటరీ మిత్రుల సౌజన్యంతో గోశాలకు ప్రతి నెల తమ వంతుగా సాయం అందించడం జరుగుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీ రయ్య తెలిపారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వి శ్వభారతీ రోడ్డులోని హరిహరగోశాలకు రోటరీ మిత్రుల సౌజన్యంతో 12 బస్తాల దాణాను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాస రావు, జ్యోతి చంద్రమౌళి, శే షారెడ్డి, దర్శవరపు శ్రావణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, గోశాల నిర్వాహకుడు సుబ్బారావు పాల్గొన్నారు.


వాసవీ అమ్మవారికి లక్ష మల్లెల అర్చన

పర్చూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి సోమవారం రాత్రి లక్ష మల్లెపూలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. వైశాఖ పౌర్ణమినాడు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో మల్లెపూలతో అర్చన కార్యక్రమం చేస్తే సమస్త దోషాలు వీడి సుఖశాంతులు వర్ధిల్లుతాయని ఆలయ అర్చకులు హర్షవర్ధనాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీరాం వెంకట సుబ్బారావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అమ్మవారికి మల్లెపూల అర్చనలో మహిళా భక్తులు

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విక్రం వెంకటరావు, టీడీపీ నాయకులు

చినగంజాం, మే 13(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విక్రం వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్యలు కోరారు. మండలంలోని గొనసపూడి గ్రామంలో విక్రం నారాయణ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారు పోలేరమ్మ దేవస్థానం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. డాక్టర్లు రామాంజనేయులు, కిరణ్‌జ్యోతిలు 255 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటికి సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండ్రగుంట శ్రీహరి, బత్తుల శ్రీనివాసరావు, దివ్వకోలు రాము, యడ్లపల్లి సురేష్, రామిశెట్టి వెంకటేశ్వర్లు, కనపర్తి వీరాస్వామి, పట్టాభి వెంకటేశ్వర్లు, నార్నె సత్యం, వంకాయలపాటి అంజిబాబు, మండాటి వెంకటరావు పాల్గొన్నారు.

డీడీ తీస్తే విద్యుత్ స్తంభాలను తొలగిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మార్టూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు అంటూ ఈ నెల 11వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన కథనానికి మండలంలోని విద్యుత్ అధికారులు స్పందించారు. వలపర్ల గ్రామంలో సిమెంటురోడ్డు నిర్మాణం చేసే సమయంలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ సిమెంటురోడ్డును నిర్మించారు. మంగళవారం విద్యుత్ ఏఈ కిరణ్ మాట్లాడుతూ ఆ విద్యుత్ స్తంభాలను తొలగించి, మరోచోట ఏర్పాటుచేసేందుకు పంచాయతీ ద్వారా షిఫ్టింగ్ లెటరు, అందుకు సంబంధించిన నామినల్‌గా కొంతఫీజుతో డీడీని తీసి పంపిస్తే తాము తొలగిస్తామన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మోహనరావు

పర్చూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడులతో లాభసాటి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మోహనరావు చెప్పారు. పర్చూరు మండల పరిధిలోని నూతలపాడు పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల ఆధారంగా చేపట్టే ప్రకృతి వ్యవసాయంతో రసాయన ఎరువుల వాడకం తగ్గి తద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. దీంతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని చెప్పారు. ప్రతి రైతు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం ఖరీఫ్ 2025కు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను వివరించారు.

సెయింట్ ఆన్స్ ఫిజికల్ డైరెక్టర్ ‘అన్నం’కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ఫిజికల్ డైరెక్టర్ అన్నం శ్రీనివాసరావు

చీరాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ ఆన్స్‌కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అన్నం శ్రీనివాసరావు బెస్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పర్సనల్ అవార్డు అందుకున్నారు. కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన యూనివర్సిటీ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్‌లో అవార్డు అందుకున్న నేపథ్యంలో మంగళవారం కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. అలాగే స్పోర్ట్స్ డే కళాశాల ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సయ్యద్ ఖాజావలి 93 కేజీల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించడంతో వైస్ చాన్స్‌లర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ చేతుల మీదుగా రూ.25 వేల చెక్కును అందజేశారు. వివిద పోటీల్లో కళాశాల నుంచి పోటీ చేసిన విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి వివిద శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.